తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
30 ఏళ్ల ప్రస్థానం వార్షికోత్సవం 1996 - 2026

# ఐసిడిఎస్‌లో... చెడిపోయిన పాలు సరఫరా!



చిట్వేలి, జూలై 4 ప్రభాతవార్త: ఆరు సంవత్సరాల లోపు పిల్లల్లో మానసిక, శారీరక ఎదుగుదలతో పాటు, ఆటపాటలతో కూడిన ప్రాథమిక విద్యను అందించడం మరియు తల్లులకు,బాలింతలకు పౌష్టిక ఆహారం సమకూర్చి వారి ఆరోగ్యాన్ని పెంపొందించే ఉద్దేశంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న సమగ్ర శిశు అభివృద్ధి సేవలు (ఐసిడిఎస్) చిట్వేలి ప్రాజెక్టు పరిధిలో కుంటుపడ్డాయన్న విమర్శలు జోరుగా వినపడుతున్నాయి. చిట్వేలి, పెనగలూరు మండలాలకు సంయుక్తంగా పనిచేస్తున్న ఈ ప్రాజెక్టు అధికారి తీరుతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. గతంలో రైల్వేకోడూరు ఈ ప్రాజెక్టు ప్రధాన కేంద్రంగా ఉండేది. స్థానిక నాయకులు ప్రజా ప్రతినిధులు చొరవతో చిట్వేలి మండల కేంద్రంగా పై రెండు మండలాలకు సేవలను అందిస్తూ ఉంది. కాగా అంగన్వాడి సెంటర్ల పనితీరు, పౌష్టిక ఆహార లోపాలను గుర్తించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాల్సిన ఆ అధికారి అడిగిన కిందిస్థాయి ఉద్యోగులపై చిందులు వేస్తూ విరుచుకుపడుతున్నారన్న విమర్శలు లేకపోలేదు. తక్కువ స్థాయి పరిమాణంలో ఉన్న కోడిగుడ్ల పంపిణీ, సకాలంలో పంపిణీ చేయక ఉబ్బిపోయి చెడిపోయిన పాల ప్యాకెట్ల సరఫరా నిలువెత్తు సాక్ష్యాలుగా గోచరిస్తున్నాయి. వీటన్నింటిపై అధికారుల పర్యవేక్షణ ఏమైంది, మాకు మా పిల్లలకు ఆరోగ్య ఇబ్బందులు తలెత్తితే బాధ్యులు ఎవరు అంటూ బాధితులు ప్రశ్నిస్తున్నారు. రెండు రోజుల క్రితం తనకు అందిన పాల ప్యాకెట్లను తెరవగా దుర్వాసనతో పాటు, పెరుగుగా మారిపోవడంతో ఎవరికి చెప్పుకోవాలో దిక్కుతోచక బాధితురాలు చరవాణి ద్వారా ప్రభాతవార్తకు ఫోటోలు, వీడియోలు చేరవేయడం జరిగింది. బాధితులు సంబంధిత గ్రామ ఐసిడిఎస్ సిబ్బందికి తెలిపినప్పుడు వారు వెళ్లి ఆ ఉన్నత అధికారికి నివేదిస్తే వారిపై చిందులు వేయడం, బెదిరించడంతో సిబ్బంది ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదు. ఇదే క్రమంలో కొనసాగితే ప్రభుత్వ లక్ష్యం, ప్రాజెక్టు పనితీరు పలు విమర్శలకు తావునిస్తుంది.

## ప్రపంచ స్థాయి...

# వైద్య మేధస్సు తీసుకొచ్చా

**-కుప్పం అభివృద్ధికి ఇది ఆరంభం మాత్రమే -కుప్పం బంగారు గనుల్ని ప్రారంభిస్తాం - త్వరలోనే ఎయిర్‌పోర్టు వస్తుంది - కుప్పంలో ఉండేది సిబిఎన్...ప్రజలకు రక్షణ కవచంలా ఉంటా -కుప్పంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు**





కుప్పం బహిరంగసభలో ప్రసంగిస్తున్న సిఎం చంద్రబాబునాయుడు , కంగుందిలో సిఎంకు కలశాలతో స్వాగతం పలుకుతున్న మహిళలు

కుప్పం, జూలై 4 ప్రభాతవార్త: కుప్పం అభివృద్ధిలో ఇది ఆరంభం మా త్రమేనని మును ్ముందు కుప ్పం రూపురేఖలు మార్చేందుకు స ్వర్ణకుప్పంకు నాంది పలికామని సిఎం చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. కుప్పం పర్యటనలో భాగంగా శనివారం కుప్పం ఆర్టీసీ బస్టాండ్‌లో ఏరా ్పటుచేసిన బహిరంగసభలో సిఎం పాల్గొని ప్రసంగించారు. కుప్పం చిగురుగుంట బంగారు గనుల్ని త్వరలో ప్రారంభిస్తామని సిఎం ప్రకటించారు. దీంతో పాటు కుప్పానికి త్వరలోనే ఎయిర్‌పోర్టు సైతం వస్తుందన్నారు. కుప్పంలో ఉండేది సిబిఎన్ అని ఇక్కడ రౌడీయిజం చెల్లదని ప్రజలకు తాను రక్షణ కవచంలా ఉంటానని పేర్కొన్నారు. నీతికి మారుపేరైన కుప్పంలో గత వైఎస్సార్సీ పాలనలో స ్మగ్లింగ్, లూటీలు చేశారన్నారు. కుప్పంలో రౌడీ యిజ ం చేసే వారిని నడిరోడ్డుపై నిలబెడతానని హెచ్చరించారు. 2019-24లో తనను సైతం కుప్పం రానీయలేదన్నారు. కుప్పాన్ని యుద్ధభూమి చేశారన్నారు. అన్న క్యాంటీన్ ధ ్వంసం చేశారన్నారు. కుప్పంపై కక్షగట్టారన్నారు. హంద్రీ-నీవా సెట్టింగ్‌లు వేశారని విమర్శించారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకనే తనను సైతం అప్పట్లో అరెస్ట్ చేశారని పేర్కొన్నారు. తనకు ప్రజాసంక్షేమం, శాంతిభద్రతలు ముఖ్యం అని స్పష్టం చేశారు. 2003లో తాను తీవ్రవాద సిద్ధాంతాలు తప్పు అని చెప్పి వారిపై చర్యలు చేపడితే తిరుమల దారిలో 23క్లైమోర్ మైన్స్‌తో తనపై పేల్చారని తనను వెంకటేశ్వరస్వామే కాపాడారని పేర్కొన్నారు. రాయలసీమలో ముఠాకక్షలు అరికట్టామని, హైదరాబాద్‌లో మతసామరస్యం కాపాడానని సిఎం పేర్కొన్నారు.

**413కోట్లతో మౌలిక వసతులు :**

కుప్పంలో 413కోట్లతో ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. కుప్పంలో ఆర్థిక అసమానతలు తగ్గించేందుకు అదాని, మేఘా, టివిఎస్ సంస్థలు 9వేల కుటుంబాలను దత్తత తీసుకుని 6కోట్లతో బంగారుకుటుంబాలను ఆదుకున్నారన్నారు. 1.15లక్షలమందికి సంజీవని వైద్య పరీక్షలు చేయించామన్నారు.5179మందికి ఇళ్లు పూర్తి చేయించి 102కోట్ల బిల్లులు చెల్లించామన్నారు. 39వేలమందికి ప్రతినెలా సామాజిక పెన్షన్లు, 32973మందికి తల్లికివందనం ఇచ్చామన్నారు.

**ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి :**

కుప్పం ప్రాంతంలో యువతకు ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలనేది తన కోరిక అని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు.ఇంటికో పారిశ్రామికవేత్త రావాలన్నారు. 44ఎకరాల్లో 167 ప్లాట్లను ఎంఎస్ఎంఇ పార్కులో ఏర్పాటుచేశామన్నారు. కుప్పంలో ఇప్పటికే 9322కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు. వీటిద్వారా దాదాపు 80వేల మందికి ప్రత్యక్ష, పరోక్షంగా ఉద్యోగాలు లభిస్తాయన్నారు. ప్రభుత్వంపై ఉన్న నమ్మకంతోనే రాష్ట్రానికి, కుప్పానికి పెట్టుబడులు వస్తున్నా యన్నారు. కుప్పంలో డెయిరీ, ఫుడ్ ప్రాసెసింగ్, పౌల్ట్రీ పరిశ్రమలు వచ్చాయని పేర్కొన్నారు. కుప్పాన్ని హార్టీకల్చర్ హబ్, వాణిజ్య పంటల కేంద్రంగా సైతం మార్చుతామన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు కృష్ణాజలాలతో 110 చెరువులు ఇప్పటికే నింపినట్లు చెప్పారు. ఇప్పటికే 27కోట్లతో ఎస్సీ,ఎస్టీలకు చెందిన 7429గృహాలకు సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేశామని మరో 559 కోట్లతో 49వేల ఇళ్లకు సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. 34కోట్లతో 134 ఆలయాలను అభివృద్ధి చేస్తామన్నారు. 3నెలల్లోపు ప్రజల సౌకర్యార్థం అన్ని చోట్ల సెల్‌టవర్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. ప్రజల ఇళ్లపైనే పళ్లతోటలు సాగుకు సైతం కృషి చేస్తున్నట్లు చెప్పారు. టాటా సంజీవని ప్రాజెక్టు ద్వారా కుప్పానికి ప్రపంచస్థాయి వైద్య మేధస్సును తీసుకువచ్చానని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్రంలో సైతం ఈ ప్రాజెక్టు అమలు చేస్తామన్నారు. బిపి, చక్కెరవ్యాధి, గుండె, కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధ పడుతున్న 75లక్షల మంది రాష్ట్రంలో ఈ వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజల ఆరోగ్య వివరాలు డిజిటలైజ్ చేయబడుతుందన్నారు. ప్రజలు మనమిత్ర వాట్సప్ యాప్ ద్వారా సమస్యలు తెలియజేయవచ్చన్నారు. వారానికి రెండు రోజులు సమీక్ష జరుపుతానని అధికారులు బాగా పనిచేయాలని లేకుంటే చర్యలపై రాజీ పడేది లేదని సిఎం స్పష్టం చేశారు. కుప్పాన్ని అనుభూతిలా మార్చుతామన్నారు. ఇక్కడ టూరిజం, ట్రెక్కింగ్, హోంస్టే, ఎలిఫెంట్ సఫారీ, ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. సింగపూర్‌కు చెందిన సుర్బానా జురాంగ్ సంస్థతో మాస్టర్ ప్లాన్ రూపొందించినట్లు సిఎం పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యక్రమాల్లో మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్‌రెడ్డి, ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, కడ పి.డి. వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం , టిడిపి జిల్లా అధ్యక్షుడు షణ్ముగంరెడ్డి, ప్రధాన కార్యదర్శి సునీల్‌కుమార్‌రెడ్డి, రెస్కో ఛైర్మన్ ప్రతాప్, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, కడ సభ్యుడు రాజ్‌కుమార్, మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, కుప్పం మండల అధ్యక్షుడు రాజగోపాల్ పాల్గొన్నారు.

# జెబి మార్కు దిశగా అడుగులు!

**-తిరుపతిలో టిడిపికి కొత్త ఉత్సాహం !**

ప్రభాతవార్త-తిరుపతి:



సిఎం సొంత జిల్లా తిరుపతి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీకి బలమైన ఓటు బ్యాంకు, కేడర్ ఉన్నా కొందరు నాయకుల తీరుతో పార్టీని భ్రష్టుపట్టించారు. ఉన్న ఓటు బ్యాంకును కూడా కాపాడుకునే పరిస్థితిలో టిడిపి కేడర్ లేకపోవడం ఇప్పటికే కార్యకర్తలు ఆవేదన వెల్లగక్కారు. ఇదే విషయాన్ని పలు దఫాలుగా అధినేత చంద్రబాబు, యువనేత నారా లోకేశ్ వద్ద మొరపెట్టుకున్నారు. రాష్ట్రంలోనే ఎంతో కీలకమైన తిరుపతి నియోజకవర్గంలో మళ్ళీ పూర్వస్థాయిలో బలమైన పట్టుసాధించుకునే దిశగా అధిష్టానం ఆలోచనలతో తాజాగా నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాధ్యతలు జెబి శ్రీనివాస్ (మన్నెం శ్రీనివాస్ ప్రసాద్) చేపట్టారు. ఆయన నియామక ఉత్తర్వులు అందిన వెంటనే పార్టీకి చెందిన పలువురు నేతలు, అభిమానులు, కార్యకర్తలు జెబిని కలిసి తమతమ ఆనందం పంచుకున్నారు. గురు,శుక్రవారాలు రెండురోజులు జెబి నివాసం పార్టీ నేతలతో సందడిగా మారింది. వచ్చిన ప్రతి ఒక్కరినీ పేరుపేరునా పలకరిస్తూ వారి అభిమాన ఆశీస్సులందుకున్నారు. ఈ నేపథ్యంలో ఇకపై పూర్తిస్థాయిలో పార్టీని బలోపేతం చేయడానికి యువనేత జెబి శ్రీనివాసులు వ్యూహాత్మకంగా అడుగులు వేయనున్నారనేది ఆయన మదిలో ఆలోచన. తిరుపతి నియోజకవర్గంలో 50 డివిజన్లలో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలు, ద్వితీయశ్రేణి నాయకులను కలుపుకుని వెళ్ళి పనిచేసేలా ఆయన కార్యాచరణ రూపొందించు కోనున్నారు. సొంత పార్టీలో కీలక పదవులు, పార్టీ పదవుల్లో యువతను నియమించుకునే దిశగా ఆయన ఆలోచన ఉన్నట్లు తెలుస్తోంది. ప్రజలకు కష్టకాలంలో దగ్గరగా ఉంటూ వారికి ఏ ఇబ్బంది కలిగినా ఆప్రాంతంలో పార్టీ కేడర్ దగ్గరై వారి సమస్యలను పరిష్కరించే కోణంలో యువతను నియమించు కోవాలనేది ఆయన భావిస్తున్నారు.ఇంట గెలిచి రచ్చగెలవన్న చందంగా పార్టీలో సీనియర్లను, ఇప్పటికే పలు కారణాలతో పార్టీకి దూరమైన నేతలను కూడా కలసి వారితో సఖ్యతగా మెలగాలని జెబి ఆలోచన. నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ప్రమాణస్వీకారం చేసిన తరువాత సిఎం చంద్రబాబు,యువనేత నారా లోకేశ్ సూచనలకు అనుగుణంగా పార్టీని బలోపేతం చేసుకోవాలనేది ఆయన రూపొందిస్తున్న ప్రణాళికల్లో ఒకటి. దీంతో ఎంతో ప్రాధాన్యత ఉన్న తిరుపతి నియోజక వర్గంలో టిడిపి శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నింపేందుకు నూతన ఇన్‌ఛార్జి జె బి శ్రీనివాస్ కృత నిశ్చయంతో ఉన్నారు. ఇప్పటి వరకు ఒక లెక్క ఇక మీదట ఒక లెక్క అన్నట్టు పార్టీని ముందుకు తీసుకుని వెళ్ళేందుకు ఆయన అప్పుడే పావులు కదుపుతున్నారు. శనివారం నియోజక వర్గానికి చెందిన వారితో పాటు పలువురు నేతలు ఆయనను కలసి అభినందనలు తెలిపారు. గత పదేళ్లుగా వైసిపి జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్ రెడ్డి తిరుపతిలో చక్రం తిప్పుతున్నారు. అధికారం ఉన్నా, లేకున్నా అడ్డులేదన్న రీతిలో రాజకీయాలు కొనసాగుతూ ఉన్నాయి. ఆయన ఆధిపత్యానికి అడ్డుకట్ట వేయడానికిబలమైన నాయకుడికి ఇన్‌ఛార్జి బాధ్యత అప్పగించారు. తిరుపతి నగరంలో ఉన్న 50 డివిషన్లలో పార్టీకి నూతన జవసత్వాలు నింపడానికి కృత నిశ్చయంతో ఉన్నారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ ,స్థానిక నేతలను కలుపుకుని అందరి సహకారంతో పార్టీని బలోపేతం చేయడానికి ప్రయత్నం చేస్తున్నారు. రానున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో తమ పార్టీతోబాటు కూటమి పార్టీల అభ్యర్థులను ఎంపికచేయడం, ఆ తరువాత వారిని గెలిపించుకోవడం ఆయన ముందున్న సవాలే. అయితే ఆయన ఇప్పటి నుండే అందుకు తగిన పావులు కదిపేందుకు సన్నద్ధమవుతున్నట్లు ఆయన మాటల్లోనే అర్థమవుతోంది.

## కుప్పం నుంచి జలధార జలహారతి పనులపై...

# జిల్లా కలెక్టర్లతో సీఎం చంద్రబాబు సమీక్ష

కుప్పం, జూలై 4 ప్రభాతవార్త : రాష్ట్రంలో జలధార జలహారతి పనుల్ని నిర్దేశిత లక్ష్యంలోగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. కుప్పం పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జలధార జలహారతిపై సమీక్ష నిర్వహించారు. గడచిన ఐదు రోజులుగా జిల్లాల పర్యటనలో బిజీగా ఉన్నప్పటికీ రాష్ట్రంలో చేపట్టిన ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంపై అధికారులతో సీఎం సమీక్షించారు. ఈ కార్యక్రమం కింద నిర్దేశించుకున్న 100 రోజుల గడువులోగా మంజూరు చేసిన పనుల్ని పూర్తి చేసి తీరాలని దిశానిర్దేశం చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించాలని సూచించారు. జిల్లాల్లో నీటి భద్రత కోసం వివిధ నీటి వనరుల బేసిన్లను అనుసంధానించేందుకు ప్రయత్నం చేయాలని సీఎం స్పష్టం చేశారు. మిగులు నుండి లోటు ప్రాంతాలకు నీటిని తరలించి స్థానిక నీటి అవసరాలకు నిల్వ సామర్థ్యాన్ని మెరుగు పరచాలని సూచించారు. ఆమేరకు మిగులు నుంచి లోటు ప్రాంతాలకు నీటిని తరలించేలా అనుసంధాన పనుల్ని చేపట్టాలన్నారు. ఈ ప్రక్రియ ద్వారా దీర్ఘకాలిక నీటి భద్రతను సాధించే అవకాశముంటుందని సీఎం స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో మైక్రో బేసిన్ కనెక్టివిటీపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను గరిష్టంగా సద్వినియోగం చేసుకోవడానికి శాస్త్రీయ డేటా ఆధారిత విధానాన్ని అనుసరించాలని సూచించారు. మైక్రోబేసిన్ అనుసంధాన ప్రక్రియలపై అధ్యయనం చేయాలని జలవనరుల శాఖను ఆదేశించారు.

**ఉత్తమ విధానాల అమలు :**

నీటి భద్రత సాధించేందుకు, భూగర్భ జలాల పెంపునకు వివిధ జిల్లాల్లో అనుసరించిన ఉత్తమ విధానాల్ని కూడా అమలు చేయాలని ముఖ్యమంత్రి కలెక్టర్లకు సూచించారు. ఇప్పటికే వివిధ జిల్లాల్లో అనుసరించిన ఉత్తమ విధానాల్ని, విజయవంతమైన పద్ధతుల్ని డాక్యుమెంట్ చేయాలని స్పష్టం చేశారు. ఇతర జిల్లాల్లో సాధ్యమైన చోట బెస్ట్ ప్రాక్టీసెస్ ను అనుసరించాలన్నారు. కాస్కేడ్ వ్యవస్థలను కూడా పునరుద్ధరించాలని ముఖ్యమంత్రి కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా నంద్యాల, కర్నూలు జిల్లా కలెక్టర్లు ప్రదర్శించిన కాస్కేడ్ పునరుద్ధరణ కార్యక్రమాల్ని ముఖ్యమంత్రి అభినందించారు. ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో వాతావరణాన్ని తట్టుకునే వ్యవసాయ ప్రణాళికలపై కలెక్టర్లు దృష్టి సారించాలన్నారు. సరైన నీటి నిర్వహణతో పాటు తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించేలా జలవనరుల శాఖ ఇతర శాఖలతో సమన్వయం చేసుకోవాలని స్పష్టం చేశారు. జలధార జలహారతిపై నివేదిక: రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన జలధార జలహారతి కార్యక్రమం తో వచ్చిన ఫలితాలను అంచనా వేసేందుకు ఓ శాస్త్రీయపరమైన విశ్లేషణ చేపట్టాలని సీఎం నిర్దేశించారు. రాష్ట్రంలో వర్షపాతం, భూగర్భ జలాలల ప్రభావానికి సంబంధించిన అంశంపై లోతుగా పరిశీలన చేపట్టాలని కలెక్టర్లకు ముఖ్యమంత్రి సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్సుకు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామా నాయుడు, ఆ శాఖ ఉన్నతాధికారులు సహా అన్ని జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.






# ఆగిన...

# శివం టు శివంరోడ్డు పనులు

**-టెక్నికల్ శాంక్షన్ కోసం కాంట్రాక్టర్ -పట్టాల కోసం బాధితులు**



అర్థాంతరంగా ఆగిన శివంటు శివం రోడ్డు పనులు

శ్రీకాళహస్తి,జూలై 4 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయం సుమారు రూ.33 కోట్లుతో చేపట్టిన 'శివం టు శివం రోడ్డు' పనులకు బాలా రిష్టాలు తొలగటం లేదు. ప్రస్తుతం గతంలో మంజూరు చేసిన టెక్నికల్ శాంక్షన్ ప్రకారం పనులు పూర్తి అయ్యాయి. అయితే ఇంకా పని మిగిలి ఉంది. కానీ దేవాదాయశాఖ నుంచి టెక్నికల్ శాంక్షన్ అందాల్సి ఉంది. ఈ మేరకు ఇంజనీరింగ్ విభాగం కసరత్తు ప్రారంభిం చింది. అధికారుల ఆదేశాలతో కాంట్రాక్టర్ ఎంత పరుగులు తీస్తున్నా పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రస్తుతం కొత్తగా ఇళ్ళుతొలగించిన బాధితులు పేచీ పెట్టడంతో, పనులు ఆగాయి.

**టెక్నికల్ శాంక్షన్ కోసం అధికారులు:**

శ్రీకాళహస్తీశ్వరాలయం చేపట్టిన శివం టు శివం రోడ్డుప నులు నిర్ణీత గడువు లోపల పూర్తి చేయుటకు కాంట్రాక్టర్ పరుగులు తీస్తున్నారు. అయితే ప్రాజెక్టులో అనుతించిన మేరకు పనులను పూర్తి చేసిన కాంట్రాక్టర్ తరువాత అనుమతి లేకపోవటంతో పనుల చేయాలా? వద్దా? అనే మీమాంసలో కొట్టు మిట్టాడుతు న్నారు. దాంతో ఆలయ ఇంజనీరింగ్ అధికారులు టెక్నికల్ శాంక్షన్ కోసం పరుగులు తీయటానికి ప్రయత్నిస్తున్నారు.టెక్నికల్ శాంక్షన్‌లో దేవాదాయశాఖ ఏం పేచీలు పెడుతుందో ఏమో? అని సందిగ్దంలో ఉన్నారు.అయితే రోడ్డు పనులు స్వర్ణముఖి ఆనకట్ట వరకు పూర్తి అయ్యాయి.అక్కడ నుంచి స్వర్ణముఖి వంతెన వరకు పనులు జరగాల్సి ఉంది.ఈ పనులే ముఖ్యం. గత ఏడాది ఇక్కడ వర్షాలతో నదికి నీరు రావటంతో పనులు ఆగాయి. అయితే ప్రస్తుతం నదిలో పనులు పూర్తి అయ్యాయి. దుర్గాంబ కొండ పక్కన పనులు జరగాల్సి ఉంది. ఇక్కడ రిటైన్ వాల్‌తో పాటు మురుగునీటి కాలువను నిర్మించాల్సి ఉంది. ప్రాజెక్టులో ఇదే ప్రధాన భాగం. ఈ పనులన్ని చేసినా సర్కిల్ ఏర్పాటు చేయాలంటే ఇక్కడ జయం లాడ్జి అనే భవనంలో కొంత భాగం సేకరించాల్సి ఉంది. నాడు బాధితుడు దేవస్థానం చుట్టూ తిరిగినా పట్టించుకోలేదు. నేడు ఆ లాడ్జి యజమాని ముందుకు రావటం లేదు. ఇన్ని కోట్లు వెచ్చించినా ఇక్కడ సర్కిల్ రానిదే అందగించదు. మరి ఈ సేకరణ ఎప్పటికి చేస్తారు? మరో శివరాత్రికి అయినా పూర్తి చేస్తారా? లేదా? అనేది చర్చనీయాంశంగా మారింది.ఇదే తంతు మాస్టర్‌ప్లాన్‌కు సంబంధించి చోటు చేసుకుంది. ఒకే ఒక భవనం సమస్య పరిష్కరించటానికి కలెక్టరేట్ ఏడాదిన్నరగా మీన మేషాలు లెక్కిస్తున్నారు. భక్తులు సమర్పించిన రూ.వంద కోట్లు వెచ్చించి ప్రేక్షకుల్లా మారారు.

**పట్టాల కోసం బాధితుల ఆందోళన:**

శ్రీకాళహస్తీశ్వరాలయం చేపట్టిన శివం టు శివం రోడ్డు పనుల్లో రామసేతు వంతెన నుంచి దుర్గాంబ కొండ వరకు 10ఇళ్ళను తొలగించారు.ఈ తొలగింపుకు రాజకీయనాయకుడు హామీ ఇచ్చారు. శ్రీకాళహస్తి ఆర్‌డిఓ సారథ్యంలో బాధితులకు అరచేతిలో స్వర్గం చూపారు. ఒక్కొక్క ఇంటి యజమానికి రూ.50వేలు ఇవ్వటానికి అలాగే రాజీవ్‌నగర్‌లో ఇంటి స్థలాలు ఇవ్వటానికి ఒప్పించారు. ఇళ్లుకొట్టారు, అయితే బాధితులకు ఇచ్చిన హామీ మేరకు నగదు చెల్లించలేదు. ఇక ఇంటి పట్టాలు ఇవ్వలేదు. దాంతో తమకు ఇచ్చిన హామీ అమలు చేసిన తరువాతనే పనులు చేయాలని అడ్డగించారు. ఇది మరో అవరోధంగా మారింది. శివం టు శివం రోడ్డు పనుల్లో ఇళ్ళు కొల్పోయిన బాధితులకు ప్రత్యామ్నాయంగా రాజీవ్‌నగర్‌లో ఇంటి పట్టాలు ఒక్కొక్కరికి ంరెండు సెంట్లు చొప్పున ఇవ్వటానికి శ్రీకాళహస్తి తహశీల్దార్ సిద్దం చేసినట్లు సమాచారం అయితే ఇందుకు కలెక్టర్ అనుమతి అవసరం. అక్కడ నుంచి అనుమతి వస్తే పంపిణికి సిద్ధంగా ఉన్నారు.

# కోటలో కొలువు... దర్జాగా కబ్జాలు!

**-భూమి యజమానులపై తిరుగుబాటు**



కబ్జా స్థలంలో బాధితులు

చంద్రగిరి, జూలై 4 ప్రభాతవార్త: చారిత్రాత్మక చంద్రగిరి రాయలవారి కోటలో ఉద్యోగం వెలగబెడుతూ కోట సమీపంలోని భూములను కబ్జాచేసి తన భార్య పేరిట ఆన్‌లైన్ చేయించుకుంటున్న ఆ ఘనుడు ఎవరు ఏమిటనే పరిశీలిస్తే.. చంద్రగిరి కోటలో ఆర్కియాలజీ విభాగం మల్టీ టాస్కింగ్ స్టాఫ్ (ఎంటిఎస్)గా విధులు నిర్వహిస్తున్న సిద్దయ్య కబ్జాలు చేయడం, రెవెన్యూ యంత్రాంగాన్ని బురిడీ కొట్టించి తన భార్య పేరిట రికార్డులు పుట్టించడంలో ఘనత వహించాడు. చంద్రగిరి కోట గ్రామానికి చెందిన మండలనేని వంశస్థుల వద్ద ఒకప్పుడు సేద్యం చేసుకునే సిద్దయ్య ఆ వంశస్థులు వివిధ కారణాలతో వేర్వేరు ప్రాంతాలకు వెళ్ళారు. ఈ నేపథ్యంలో మండలనేని వారి భూములన్నింటినీ తన భూములుగా కోటలో చెప్పడం మొదలు పెట్టాడు. మండలనేని వారి భూములను కబ్జా చేయడమే కాకుండా తన భార్య బుద్దల లలితమ్మ పేరిట ఆన్‌లైన్ చేయించిన ఘనుడు రెవెన్యూ అధికారులకు బాగానే చేతులు తడిపిడినట్లు తెలిసింది. బుద్దల లలితమ్మకు సంబంధం లేని భూములను రెవెన్యూ అధికారులు ఏకంగా ఆమెకు అనువంశికంగా సంక్రమించిన ఆన్‌లైన్‌లో పొందుపరచడం ఆశ్చర్యం కలిగిస్తున్నది. సదరు భూ యజమానులు పొలంలోనికి ప్రవేశిస్తే సిద్దయ్య ఆగమేఘాల మీద అక్కడికి చేరుకుని వారినే అడ్డుకుని మీ రికార్డులు తీసుకురండని బెదిరించడం రివాజుగా పెట్టుకున్నాడు. మా భూములకు మేము రిక్డాలు చూపడమేంటి మీ దగ్గర ఏ రికార్డులు ఉన్నాయో చూపమని అడిగితే మీకెందుకు చూపాలి రెవెన్యూకు చూపిస్తానంటూ బెదిరిస్తాడు. తీరా రెవెన్యూ అధికారులు నోటీసులు పంపిస్తే కనీసం ఆ ఛాయలుకు కూడా రాకుండా పారిపోతాడు. కాదని రికార్డులపై యజమానులు నిలదీస్తే నా రికార్డులు బ్యాంకులో వున్నాయంటూ దబాయిస్తాడు. ఈ నేపథ్యంలో కోట వద్ద శనివారం తాను కబ్జా చేసిన భూమికి ఫెన్సింగ్ వేయడానికి సిద్దం చేసుకున్నాడు. దీంతో యజమానులు సంఘటనా స్థలికి చేరుకుని నిలదీయడం సరిగ్గా అదే సమయంలో మీడియా అక్కడికి చేరుకోవడంతో పారిపోయాడు. ప్రస్తుతం బాధితుల పేరిట గల భూములను తన భార్య పేరిట ఆన్‌లైన చేసుకున్న డాక్యుమెంట్ మీడియాకు అందించారు. ఈ భూములను ఆన్‌లైన చేసిందెవరు, ఏ రికార్డులను అనుసరించి ఆన్‌లైన్ చేశారనే విషయాలపై పూర్తి విచారణ జరిపించి, తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. ఒక కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిగా వుంటూ ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడుతున్న సిద్దయ్యపై శాఖాపరమైన చర్యలు తీసుకుని విచారణ చేపడితే కోట ఉద్యోగులే వాస్తవాలు వెళ్ళడించగలరు. ఆ మేరకు రెవెన్యూ అధికారులు విచారణ జరిపి ఆన్‌లైన్ నుండి బుద్దల లలితమ్మ పేరును తొలగించి తమ పేరిట ఆన్‌లైన్ మార్పులు చేసి, పాస్‌బుక్‌లు మంజూరు చేయాలని మండలనేని వంశస్థులు కోరుతున్నారు. సుమారు మూడున్నర ఎకరాలు భూములను సిద్దయ్య కబ్జా చేసినట్లు ఆరోపిస్తున్నారు.




5CTR 2:5CTR 2.qxd 7/4/2026 10:42 PM Page 1



## పోగురుపల్లి పారిశ్రామికవాడలో సోలార్ విద్యుత్ ఆవిష్కరణ

**కుప్పం, జూలై 4 ప్రభాతవార్త:**



గుడుపల్లె మండలం పోగురుపల్లి పారిశ్రామిక వాడలో రెండు కిలోవాట్ల రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ వ్యవస్థను సిఎం చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. ఈప్రాజెక్టును ఎస్ఎం రీఎనర్జీ ప్రై.లిమిటెడ్ సంస్థ పిఎసూర్యఘర్ ముఫ్త్ బిజిలీ పథకం కింద విజయవంతంగా పూర్తి చేసింది. ఈ సోలార్ వ్యవస్థతో 7489మంది ఎస్సీ,ఎస్టీ లబ్దిదారులకు లబ్ది కలుగుతుందన్నారు. గ్రామస్థాయిలో నెలకొల్పిన ఈరూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ వ్యవస్థలో దేశంలోనే ఒకటిగా నిలిచిందని వారు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట పూర్తి చేయడం ఇతర రాష్ట్రాల్లోని గ్రామాల్లో సోలార్ ఇంధన వ్యవస్థ స్థాపనకు మార్గదర్శి అవుతుందన్నారు.

## నేడు సిఎం పర్యటన వివరాలిలా !!

**కుప్పం, జూలై 4 ప్రభాతవార్త:**

కుప్పం నియోజకవర్గంలో సిఎం చంద్రబాబు నాయుడు ఆదివారం పర్యటన వివరాలిలా.. జూలై 5న ఉదయం 10.25గంటలకు కడపల్లి వద్ద తమ సొంతింటి నుంచి బయలుదేరి సమీపంలో ఏర్పాటుచేసిన ప్రజాప్రతినిధులు, ఇతర నాయకులతో సమావేశం అవుతారు. అనంతరం పి4 స్టాల్‌ను సందర్శిస్తారు. మధ్యాహ్నం 1.05గంటలకు స్వగృహం చేరుకుని మరలా 2.20గంటలకు శాంతిపురం వద్దగల పర్యావరణ సహిత కోళ్లఫామ్‌ను సందర్శిస్తారు. అనంతరం తమ స్వగృహం వద్ద రైతులతో సమావేశమవుతారు. సాయంత్రం 4గంటలనుంచి ద్రవిడ వర్సిటీలో అధికారులతో జరిగే సమావేశంకు హాజరై సాయంత్రం 5.15గంటలకు స్వగృహం చేరుకుని రాత్రిబస చేస్తారు.

## టైరు పంచరై బోల్తా పడ్డ వాహనం

**పుల్లంపేట, జులై 4 ప్రభాతవార్త :**

పుల్లంపేట బైపాస్ లోని పెట్రోల్ బంకు దగ్గర శనివారం తుఫాన్ ఏపీ 21 వై 36 39 నంబర్ గల వాహనం టైర్ పంచర్ కావడంతో బోల్తా పడింది ఈ సంఘటనలో వాహనంలో ఉన్న నలుగురికి గాయాలయ్యాయి తిరుమల దైవ దర్శనానికి వెళ్లి తిరిగి స్వగ్రామమైన కర్నూల్ జిల్లా నందికొట్కూరు వెళుతుండగా పుల్లంపేట సమీపానికి రాగానే బోల్తా పడింది గాయపడిన వారిని పుల్లంపేట ఎస్ఐ చిన్న రెడ్డప్ప అంబులెన్స్ ద్వారా రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు వీరిలో శ్రీలత 38 తలకు తీవ్ర గాయాలయ్యాయి

## లీక్ అవుతున్న మంచినీటి కొళాయి

### -పట్టి పట్టనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

**ఓబులవారిపల్లి, 4 జూన్ ప్రభాతవార్త**



మండల కేంద్రమైన ఓబులవారిపల్లి జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో గత కొన్ని నెలలుగా మంచినీటి కొళాయి పైపు లీకేజీ కావడంతో నీరు అధికంగా ప్రవహించి ఉండడంతో పాఠశాలకు వెళ్లే విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా నీరు గ్రౌండ్ మొత్తం ప్రవహించడంతో కొంత నడవడానికి ఇబ్బందికరంగా మారిందని పలువురు విద్యార్థులు వాపోతున్నారు. సంబంధిత పంచాయతీ అధికారులు చొరవ చూపి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

## కూటమితో రైల్వేకోడూరు అభివృద్ధి

### -టిడిపి ఇన్‌చార్జి ముక్కా రూపనంద రెడ్డి

**రైల్వేకోడూరు రూరల్, జులై 4ప్రభాతవార్త :**



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి రైల్వేకోడూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు అహర్నిశలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ ఆశీస్సులతో రైల్వే కోడూరు నియోజకవర్గ అభివృద్ధి పథంలోకి దూసుకెళుతుందని రైల్వేకోడూరు టిడిపి ఇన్చార్జ్ ముక్కా రూపనంద రెడ్డి పేర్కొన్నారు. శనివారం రైల్వేకోడూరు నియోజకవర్గంలోని టోల్గేట్ వద్ద ఉన్న అల్లూరి సీతారామరాజు 129వ జయంతిని ఘనంగా నిర్వహించి, అనంతరం కామిశెట్టి నగర్‌లో 75 లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన సిమెంట్ రోడ్ల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని అత్యంత వైభవపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రూపానంద రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం కట్టుకథలతోనూ, మాయ మాటలతోనూ కాలయాపన చేసి ప్రజలు పెట్టుకున్న ఆశలను అతిఆసలు చేసిందని ప్రస్తుత కూటమి ప్రభుత్వం చెప్పింది చేస్తున్నదని అందుకు నిదర్శనమే కామిశెట్టి నగర్ సిసి రోడ్డు నిర్మాణం అని అన్నారు. దాదాపు 20 సంవత్స రాలుగా అధికారంలో ఉన్న గత పాలకులు ఎటువంటి అభివృద్ధి చేయకుండానే దిగిపోయారని ఆయన దుయ్యబెట్టారు. ప్రస్తుతం మూడు రోజుల క్రితం రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రిలు రైల్వేకోడూరు నియోజకవర్గానికి అభివృద్ధి నిధులు వెలుగుల కురిపించారన్నారు. రానున్న మూడు సంవత్సరాలలో రైల్వేకోడూరు అభివృద్ధిని చరిత్రలో మరిచిపోలేని విధంగా చేపట్టనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే ఆరవ శ్రీధర్ మాట్లాడుతూ రైల్వే కోడూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కూటమి ప్రభుత్వం విజయవంతంగా పనిచేస్తున్నారని ప్రజల అవసరాలను తీర్చడంలో కూటమి ప్రభుత్వానికి సాధ్యమని అన్నారు. జనసేన నాయకులు తాతంశెట్టి నాగేంద్ర మాట్లాడుతూ రైల్వే కోడూరు నియోజకవర్గాన్ని రానున్న మూడు ఏళ్లలో ఎన్నికలలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి మంగంపేట లో నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించేంత వరకు విశ్రమించమని, అదేవిధంగా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిల ఆశీస్సులతో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో రాష్ట్రంలో గుర్తుండిపోయే విధంగా అభివృద్ధి చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ముక్కా రూపనంద రెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మమ్మ, డీసీఎంఎస్ చైర్మన్ ఎర్రగుంట్ల జయప్రకాష్,సురపు రాజు పల్లి మాజీ సర్పంచ్ సుబ్బరాజు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రవి కుమార్ రాజు, తల్లెం రమణారెడ్డి, బీసీ నాయకులు కమతం నాగరాజు, శేఖర్ రాజు, మల్లికార్జున రెడ్డి, మాజీ సర్పంచ్ పుష్పలత, శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ముక్కా రూపానందరెడ్డిని,ముక్కా వరలక్ష్మమ్మ ను ఘనంగా పూలమాలలతో సత్కరించారు

## కలెక్టర్‌కు సన్మానం



**రైల్వేకోడూరు రూరల్, జులై 4ప్రభాతవార్త:**

రైల్వే కోడూరు నియోజకవర్గం తిరుపతి జిల్లాలో కలిపి నప్పటి నుండి తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ నియోజకవర్గాన్ని దినదిన అభివృద్ధి చేయడంలో సఫలీకృతు లయ్యారని రైల్వేకోడూరు టిడిపి యువ నాయకులు పంతగాని నరసింహ ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా తిరుపతిలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ను కలుసుకొని సన్మానాన్ని నిర్వహించారు. భవిష్యత్తులో రైల్వే కోడూరు నియోజక వర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తున్నందుకు ఆయనకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు పంతగాని వివరించారు.

## ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని వేగంగా చేయాలి

### రైల్వే కోడూరు ఎలక్షన్ అధికారి శోభన్ బాబు

**పెనగలూరు(జూలై 04) ప్రభాతవార్త**



తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజక వర్గం పెనగలూరు మండలం లో ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని వేగంగా పూర్తి చేయాలని తిరుపతి జిల్లా డిఆర్ డిఏ పీడీ, రైల్వే కోడూ రు ఎలక్షన్ అధికారి శోభన్ బాబు తెలిపారు. శనివారం ఈటిమార్పురం, నారాయణ నెల్లూ రు గ్రామాలలో ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ప్రతి ఓటరు దగ్గరికి సిబ్బంది వెళ్లాలని సూచించారు. ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. సిబ్బందికి పలురకాల సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం నిరంజన్ కుమార్, ఆర్ ఐ రామ్మోహన్ నాయుడు, మండల వైకాపా బాధ్యుడు కేతా చక్రపాణి, టీడీపీ నాయకుడు కళా చంద్ర, వీఆర్వో ముజిబ్, వెలుగు సీసీ సుధాకర్ పాల్గొన్నారు.

## ప్రజలు సహకరిస్తేనే గడువులోపు సర్ ప్రక్రియ పూర్తి

**యాదమరి, జులై 4 ప్రభాతవార్త:**



ప్రజలు సహకరిస్తేనే 'సర్' ప్రక్రియ గడువులోపు పూర్తి చేయడానికి సాధ్య పడుతుందని తహసిల్దార్ పార్థసారథి పేర్కొన్నారు. మండల పరిధిలో 'సర్' ప్రక్రియ జరుగుతున్న తీరును శని వారం తహసిల్దారు పార్థసారథి 184 గొల్లపల్లి పోలింగ్ బూత్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసిల్దారు పార్థసారథి మాట్లాడుతూ మండల పరిధిలో ఓటర్ల జాబితా సమగ్ర ప్రత్యేక సవరణ(సర్) ప్రక్రియను వేగంగా నిర్వహిస్తున్నా మన్నారు. ప్రజలు సైతం 'సర్' ప్రక్రియపై అధికారులకు తమ వంతు సహకారం అందించాలన్నారు. మండల పరిధిలో అత్యధిక కుటుంబాలు కర్నాటక రాష్ట్రం బెంగళూరు, తమిళనాడు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తమ జీవనాధారం నిమిత్తం వెళ్ళిన వారు సంబంధిత బిఎల్ఓల వద్ద ఓటరు ఫారాలకు కావాల్సిన సమాచారంను అదించి సహకరించాలన్నారు.

## గ్రామాల్లో పేరుకుపోతున్న చెత్త

**పూతలపట్టు, జులై 4 ప్రభాతవార్త:**



మండలంలో పరిశుభ్రతను కాపాడాల్సిన బాధ్యత స్థానిక సంస్థలతో పాటు ఎంపీడీవో కార్యాలయంపై కూడా ఉంటుంది. అయితే సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల చెత్త సక్రమంగా సేకరించబడకుండా పేరుకుపోతోంది. దీంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. చెత్తను సేకరించే వ్యవస్థ సరిగా అమలు కాకపోవడం, సేకరించిన చెత్తను నిర్దేశిత డంపింగ్ యార్డులకు తరలించకపోవడం చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. వర్షాకాలంలో ఈ పరిస్థితి మరింత దారుణంగా మారి దుర్వాసన, దోమలు, ఈగలు పెరిగి ప్రజారోగ్యానికి ముప్పుగా మారుతోంది. అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లినా, తగిన చర్యలు తీసుకోలేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంపీడీవో కార్యాలయం పర్యవేక్షణ లోపం, సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకోకపోవడం వల్ల సమస్య రోజు రోజుకూ తీవ్ర రూపం దాల్చుతోంది. పరిశుభ్రమైన ఆరోగ్యకరమైన సమాజానికి పునాది. అందువల్ల ఎంపీడీవో కార్యాలయం వెంటనే స్పందించి చెత్త సేకరణను క్రమబద్ధీకరించాలి. అవసరమైన వాహనాలు, సిబ్బందిని అందుబాటులో ఉంచి, పేరుకుపోయిన చెత్తను తక్షణమే తొలగించాలి. అలాగే సంబంధిత అధికారుల పనితీరును నిరంతరం సమీక్షించి నిర్లక్ష్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా చెత్త నిర్వహణపై అధికారులు ఇకనైనా మేల్కొని బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పూతలపట్టు ఎంపీడీవో కార్యాలయం పరిసరాలను వెంటనే పరిశుభ్రంగా మార్చి ప్రజలకు ఆదర్శంగా నిలవాలని స్థానికులు కోరుతున్నారు.

## ప్రజల నుంచి వినతులు స్వీకరించిన సీఎం

**శాంతిపురం, జూలై 4 ప్రభాతవార్త:**



సీఎం చంద్రబాబు నాయుడు కుప్పం పర్యటనలో భాగంగా శనివారం ఉదయం ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. మండలంలోని కడపల్లి వద్ద ఉన్న తమ సొంత నివాస గృహం వద్ద ప్రజల నుంచి వినతులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసు కున్నారు. సమస్యల పరిష్కారంకు తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు, నాగభూషణ్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఉదయ్ కుమార్, కార్మిక బోర్డు సభ్యుడు విశ్వనాథ నాయుడు, మాజీ టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, ఎల్ జయరామిరెడ్డి, మాజీ సర్పంచ్ చంద్ర,మణి, బసవరాజు గిరిధర్, రాజేంద్ర, రాజు, ఉయ్యాల జయరామిరెడ్డి, బాలు, ఉమాపతి, వేద్రశ్రీ ,చంద్రకళ, సుగుణమ్మ,అనసూయతో పాటు స్థానిక నేతలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబుచే పలు ప్రారంభోత్సవాలు.

**కుప్పం, జూలై 4 ప్రభాతవార్త:**

కుప్పం పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు నాయుడు శనివారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కుప్పం ఏరియా ఆసుపత్రి సమీపంలో స్వర్ణకుప్పం ఆర్చ్‌ను ప్రారంభించారు.గుడిపల్లి మండలం కోటపల్లి సమీపంలో 4 కోట్ల రూపాయలతో నిర్మించిన ఆఫీసర్స్ గెస్ట్ హౌస్‌ను సీఎం ప్రారంభించారు. అలాగే కుప్పం బైపాస్ రోడ్‌లో ఏర్పాటు చేసిన ఫుడ్ కోర్టును ప్రారంభించారు. అనంతరం 3.5 కోట్లతో కుప్పం స్మశాన వాటిక వద్ద నూతనంగా ఏర్పాటుచేసిన ఎల్పిజి బర్నింగ్ యూనిట్ సీఎం ప్రారంభించారు.

## సీఎం సారూ...కుప్పం సమస్యలు ఇవీ!

**కుప్పం, జూలై 4 ప్రభాతవార్త:**

కుప్పం నియోజకవర్గంలో పలు సమస్యల పరిష్కారం కోసం ప్రజలు, రైతులు ఎదురుచూస్తున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఈ సమస్యలపై స్పందించి వాటిని పరిష్కరిస్తారని ఆశిస్తున్నారు. ప్రధానంగా కుప్పం నియోజకవర్గంలో పంట పొలాలపై ఏనుగుల దాడులు నిరంతరంగా కొనసాగుతున్నాయి. కుప్పం అటవీ ప్రాంతం చుట్టూ హ్యాంగింగ్ సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో పాటు కందకాలను మరలా తవ్వించాలని రైతులు కోరుతున్నారు. ననియాల ఎకో టూరిజం లో ఇదివరకు ఉన్న శిక్షణ ఏనుగులను కుప్పంకు రప్పించి ఇక్కడ టూరిజం అభివృద్ధికి చర్యలు చేపట్టాల్సి ఉంది. కుప్పం పట్టణం ప్రధాన రహదారిలో ఉన్న పార్కు దుకాణదారులకు ప్రత్యామ్నాయంగా దుకాణాలు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు. కుప్పం ఆర్టిసి డిపోలో కాలం చెల్లిన బస్సుల స్థానంలో కొత్త బస్సులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. కుప్పంలో గిరిజన ఫలసాయ కొనుగోలు కేంద్రం ప్రారంభం చేయవలసి ఉన్నదని ప్రజలు కోరు తున్నారు.

## భూమి అనేది ఆస్తికాదు...కుటుంబానికి భద్రత

### -సిఎంచే కంగుందిలో 326మంది రైతులకు పట్టాలు పంపిణీ

**కుప్పం, జూలై 4 ప్రభాతవార్త :**



భూమి అనేది ఆస్తి మాత్రమే కాదని కుటుంబానికి భ ద్రత అని సిఎం చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. శనివారం క ంగుంది గ్రామంలో ఆరు దశాబ్దాలుగా భూపట్టాల కోసం ఎదురుచూస్తున్న 326మంది అర్హులైన రైతు కుటుంబాలకు సిఎం చంద్రబాబు పట్టాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా సిఎం మాట్లాడుతూ ఈ కార్యక్రమం తన రాజకీయ జీవితంలో ఎంతో సంతోషకరమైన సందర్భమన్నారు. న్యాయం రైతుల పక్షాన ఉండడంతో న్యాయపరమైన అంశాలు పరిశీలించి కేబినెట్ నిర్ణయంతీసుకుని రైతులకు భూపట్టాలు అందించడం జరుగుతోందన్నారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు ప్రభుత్వ లక్ష్యం అన్నారు. బిసి, ఎస్సీ, ఎస్టీ, ఓసి వర్గాలకు చెందిన అర్హులకు న్యాయం చేశామన్నారు. రాష్ట్రంలో ఉన్న భూసమస్యలు ఒక్కోటిగా పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. కుటు ంబాల్లో ఆస్తితగాదాలు, అన్న దమ్ముళ్లు, అక్కచెల్లెళ్ల మధ్య తగాదాలు తగ్గాలని సిఎం పిలుపునిచ్చారు. మహి ళలకు వారసత్వ హక్కులు గౌరవించాల్సిన బాధ్యత కుటుంబాలపై ఉందన్నారు. కంగుంది ప్రాంతాన్ని ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా మార్చుతామన్నారు. ట్రెక్కింగ్, హోంస్టేలు, రిసార్ట్‌లు, పర్యాటక వసతులు కల్పించి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ 61ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న భూసమస్యకు సిఎం చంద్రబాబునాయుడు చొరవతో శాశ్వత పరిష్కారం లభించిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్‌రెడ్డి, ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, టిటిడి బోర్డుసభ్యుడు వైద్యం శాంతారాం, టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, రెస్కోఛైర్మన్ ప్రతాప్,తహాశీల్దార్ రమేష్‌బాబు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## రాష్ట్రానికి ఆదర్శంగా నెట్‌జీరో విధానం

### - కుప్పంలో అమలుకు ఆదేశం, ఇళ్లను పరిశీలించిన సిఎం !!

**గుడుపల్లె, జూలై 4 ప్రభాతవార్త:**



నెట్‌జీరో విధానంను విజయ వంతంగా అమలు చేస్తున్న నలగాంపల్లి గ్రామాన్ని రాష్ట్రానికి ఆదర్శంగా నిలబెట్టాలని సిఎం చంద్రబాబునాయుడు ఆదేశించారు. శనివారం నలగాంపల్లిలో నెట్‌జీరో విధానం అమలు చేస్తున్న రెండు ఇళ్లను సిఎం చంద్రబాబు సందర్శించారు. సోలార్ రూఫ్‌టాప్, ఇండక్షన్ కుక్‌టాప్, వర్షపునీటి సంరక్షణ, కిచెన్ కంపోస్టింగ్, టెర్రస్ గార్డెనింగ్ వంటి విధానాలు పరిశీలించారు. కుప్పం వ్యాప్తంగా ఈ విధానం అమలు చేయాలని అధికారుల్ని ఆదేశించారు. ఇంటికి ఉన్న సోలార్ ప్యానెళ్లు, విద్యుత్ ఉత్పత్తి, ఇంటి అవసరాలకు సరిపోతుందా అనే వివరాలు ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సోలార్ ఇండక్షన్ స్టవ్‌తో 400రూ.లు ఆదా చేస్తున్నట్లు లబ్దిదారులు చెప్పారు. సర్క్యులర్ ఎకానమీని గ్రామస్థాయిలో అమలు చేయాలని అధికారులకు సూచించారు. కుప్పంలో రూఫ్‌టాప్ సోలార్ ద్వారా 7489మంది ఎస్సీ,ఎస్టీలు, 39215మంది బిసిలు, 7381మంది ఒసి కుటుంబాలకు ప్రయోజనం కలిగిస్తున్నట్లు అధికారులు సిఎంకు వివరించారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## గణనాధుని సన్నిధిలో ఇంటర్మీడియట్ డైరక్టర్

**కాణిపాకం, జూలై 4 ప్రభాతవార్త:**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంటర్మీడియేట్ బోర్డు డైరక్టర్ పి.రంజిత్‌భాషా శని వారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. అలాగే వారు శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలో కూడా ప్రత్యేకపూజలు నిర్వహించారు. వారికి ఆలయ వేద మండపంలో ఆశీర్వచననం చేసి స్వామివారి శేషవస్త్రాలను, తీర్థ, ప్రసాదాలను, చిత్రపటాన్ని అందజేశారు. ఈకార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ పీఓ వెంకట రమణ, ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, ప్రోటోకాల్ ఏఈఓ ధనపాల్, ఆలయ సూపరెండెంట్ వాసు తదితరులు పాల్గొన్నారు.

## శాశ్వత నిత్యాన్నదాన పథకానికి లక్ష విరాళం

**కాణిపాకం, జూలై 4 ప్రభాతవార్త:**



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తురాలు శనివారం లక్ష రూపాయ లను విరాళంగా అందజేశారు. ఈమేరకుతిరుపికి చెందిన భారతి అనే భక్తురాలు శాశ్వత నిత్యాన్నదాన పథకంకు 1,01,116 రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని కుటుంబ సభ్యులతో కలసి ఆలయ సూపరెండెంట్ వాసుకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ అర్చకులు, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## అనుమానస్పద రీతిలో వ్యక్తి మృతి!

**పెద్దపంజాణి, జూలై 4 ప్రభాతవార్త:**



మండలంలోని బసవరాజుకండ్రిగ గ్రామంలో ఓ వ్యక్తి అనుమానస్పద రీతిలో మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి మృతుడి తల్లి, సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు తెలిపిన మేరకు వివరాలిలా.. గ్రామానికి చెందిన ఎన్.శ్రీరాములు కుమారుడు ఎన్.సీతారామయ్య (40)కు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. సీతారామయ్య భార్య మేనమామ నాగరాజువాళ్ళ ఇంటిలో పదిరోజులుగా సీతారామయ్య కుటుంబ సభ్యులు ఉంటున్నారు. అయితే ఏమి జరిగిందో తెలియదుగానీ శనివారం ఉదయం సీతారామయ్య మృతిచెంది ఉండడాన్ని గుర్తించామన్నారు. తన కుమారుడి మృతిపై అనుమానులు ఉన్నాయని అతని తల్లి ఫిర్యాదులో పేర్కొంది. పోలీసులు మృతదేహాన్ని పంచనామా నిమిత్తం పలమనేరుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సత్వరం వైద్య ఖర్చుల కొనసాగింపు ఉత్తర్వులు

### - రాష్ట్ర వైఎస్ఆర్‌టిఎ వర్కింగ్ ప్రెసిడెంట్ రెడ్డిశేఖర్‌రెడ్డి డిమాండ్

**చిత్తూరుహెల్త్, జూన్ 4 ప్రభాతవార్త:**



ఉద్యోగ, ఉపాధ్యాయుల వైద్య ఖర్చుల చెల్లింపును కొనసాగిస్తూ సత్వరం ఉత్తర్వులు విడుదల చేయాలని రాష్ట్ర వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ వి.రెడ్డిశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గత ఏడాది ఇచ్చిన మెడికల్ రీఎంబర్స్‌మెంట్ జిఓనెం.358 ఈ ఏడాది మార్చి నెలకు ముగిసినా తదుపరి తేదీని పొడిగిస్తూ ఇప్పటి వరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయకోవడం దారుణమన్నారు. ఇహెచ్ఎస్ స్కీమ్ ద్వారా ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్రతి నెల నగదు చెల్లిస్తున్నప్పటికీ ప్రైవేటు హాస్పిటల్స్ వారు నగదు రహిత వైద్యం చేయడానికి నిరాకరిస్తున్నారని ఆరోపించారు. కాగా ఏప్రిల్ నెల నుండి నగదు చెల్లించి వైద్యం చేసుకున్న వారు పొడిగింపు ఉత్తర్వులు రాకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఆందోళనలో వున్నారన్నారు. కూటమి ప్రభుత్వం సత్వరం మెడికల్ రీఎంబర్స్‌మెంట్ పొడిగింపు ఉత్తర్వులు జారీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## వేగంగా 'సర్' క్షేత్ర స్థాయి పరిశీలన

**చిత్తూరు, జూన్ 4 ప్రభాతవార్త:**



ఓటర్ల జాబితా సమగ్ర ప్రత్యేక సవరణ(సర్)లో భాగంగా క్షేత్ర స్థాయి పరిశీలన కార్యక్రమంను వేగంగా నిర్వహించాలని మున్సిపల్ కమీషనర్, ఎఇఆర్ఓ నరసింహప్రసాద్ స్పష్టం చేశారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 83, 84, 85, 87, 95, 125 పోలింగ్ కేంద్రాల పరిధిలో జరుగుతున్న ఎన్యుమరేషన్ పత్రాల పరిశీలనను శనివారం మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ నరసింహప్రసాద్ ఎన్యుమరేషన్ పత్రాల మ్యాపింగ్, క్షేత్ర స్థాయి పరిశీలన, ఆన్‌లైన్ నమోదు తీరును పరిశీలించారు. అలాగే ఎన్యుమరేషన్ ఫారాలను పూర్తి చేయడంపై ఓటర్లకు అవగాహన కల్పించాలని, తప్పులు లేకుండా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించడానికి పక్కాగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమీషనర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత బిఎల్ఓలు, తదితరులు పాల్గొన్నారు.

## తెల్లదొరలకు ఎదురొడ్డి పోరాడిన అల్లూరి

### - జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్

**చిత్తూరు, జులై 4 ప్రభాతవార్త:**



స్వాతంత్ర్య సంగ్రామంలో తెల్లదొరలకు ఎదురొడ్డి నిలిచి పోరాడిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అని జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో అల్లూరి సీతారామరాజు జయంతి పురస్కరించుకుని శనివారం జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్ అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధికి మన్యం అల్లూరి సీతారామరాజు చేసిన కృషి మరువలేనిదన్నారు. నిత్యం ధ్యానం, పూజలతో జీవనశైలిని కొనసాగించిన అల్లూరి ఆపై స్వాతంత్ర్య సమరయోధుడిగా అవతరించారన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటీషు వారితో పోరాడి అల్లూరి సీతారామరాజు అతి చిన్న వయస్సులోనే వీర మరణం పొందారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అల్లూరి సీతారామరాజు చేసిన సేవలను గుర్తించి రాష్ట్రంలోని ఒక జిల్లాకు ఆయన పేరు పెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## చిత్తూరు అభివృద్ధిపై కనికరం చూపాలి

### - సిఎం కు సిపిఎం నాయకుల విజ్ఞప్తి

**చిత్తూరుహెల్త్, జులై 4 ప్రభాతవార్త:**



చిత్తూరు జిల్లా ఏర్పడి 115 సంవత్సరాలు పూర్తయినా చిత్తూరులో అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా వుందని చిత్తూరు అభివృద్ధికి సిఎం నారా చంద్రబాబునాయుడు కనికరించాలని జిల్లా సిపిఐ కార్యదర్శి నాగరాజు అభ్యర్థించారు. జిల్లా సిపిఐ కార్యాలయంలో శనివారం చిత్తూరు జిల్లా సిపిఐ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా సిపిఐ కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ చిత్తూరు జిల్లా నుండి రాష్ట్రంను ముఖ్యమంత్రులు పాలించినప్పటికీ జిల్లా కేంద్రం చిత్తూరు ఏ మాత్రం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. చిత్తూరు పరిసరాల్లో డిగ్రీలు, బిటెక్, ఎంటెక్ చేసిన విద్యార్థులు ఉపాధి, ఉద్యోగాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, హంద్రీ-నీవా నది చిత్తూరులో వున్నప్పటికీ ఇప్పటి వరకు చిత్తూరు ప్రజలకు తాగునీటి కష్టాలను తీర్చడానికి చర్యలు తీసుకోలేదన్నారు. జిల్లా వాసి అయిన సిఎం నారా చంద్రబాబునాయుడు చిత్తూరు అభివృద్ధిపై దృష్టి సారించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిపిఐ నాయకులు విసి గోపినాథ్, కె.మణి, దాసరి చంద్ర, విజయగౌరి, బి.కుమారి, పి.రఘు, ఎన్.ఫైరోజ్ తదితరులు పాల్గొన్నారు.

5 -7Pg9th cheli:5 -7Pg9th cheli.qxd 7/4/2026 11:05 PM Page 1



# చింతాకు సాక్షిగా..



## పులిహోరలో..

**కావలసినవి :** చింతచిగురు-కప్పు,పొడి అన్నం- రెండు కప్పులు, వేరుసెనగ పప్పు-మూడు పెద్ద చెంచాలు, సెనగపప్పు-రెండు పెద్ద చెంచాలు, ఆవాలు-అర టీ స్పూను, మినప్పప్పు-పెద్ద చెంచా, పసుపు-కొద్దిగా, కరివేపాకు-నాలుగు రెబ్బలు, ఎండు మిర్చి-మూడు, నూనె-తగినంత, ఉప్పు-రుచికి సరిపడా, ఇంగువ-చిటికెడు.

**తయారీ :** అన్నం (ఉడుకుతున్నప్పుడే ఒక చెంచా నూనె, చిటికెడు ఉప్పు కలిపి) పొడిగా వండి చల్లార్చాలి. అర టీ స్పూను నూనెలో చింత చిగురును పచ్చివాసన పోయేవరకు చిన్నమంటపై వేయించి పక్కనుంచాలి. అదే కడాయిలో నూనె వేసి ఎండుమిర్చి వేరుసెనగ గింజలు, సెనగపప్పు, మినపప్పు, ఆవాలు, కరివేపాకు పసుపు, ఇంగువ ఒక్కొకనకటిగా వేగనిచ్చిత తాలింపుని చిగురుతో పాటు అన్నంలో కలిపితే సరి.

## కొబ్బరి పచ్చడిలో..

**కావలసినవి :** చింతచిగురు- కప్పు, తాజా కొబ్బరి ముక్కలు- కప్పు, పసుపు- చిటికెడు, ఉప్పు- తగినత, పచ్చి మిర్చి- అయిదు, ఎండుమిర్చి-ఏడు, ఆవాలు-అరచెంచా, మినప్పప్పు- చెంచా, మెంతులు-కొద్దిగా, ఇంగువ- చిటికెడు, నూనె- మూడు చెంచాలు. **తాలింపు కోసం:** ఆవాలు, జీలకర్ర, మినపప్పు- చెంచా చొప్పున, కరివేపాకు- రెండు రెమ్మలు, ఎండుమిర్చి- ఒకటి. **తయారీ :** బాణలిలో నూనె పోసి కాగాక చింత చిగురు, కొబ్బరి ముక్కలు, ఉప్పు, పచ్చిమిర్చి తప్ప మిగిలినవన్నీ వేసుకుని ఎర్రగా వేయించుకోవాలి. అవి చల్లారాక మిక్సీలో వేసి ఒసారి తిప్పాలి. ఈ మిశ్రమానికి మిగిలిన పదార్థాలు కూడా చేర్చి మెత్తగా రుబ్బుకోవాలి. దీనికి చివరగా తాలింపు వేస్తే పచ్చడి తయారవుతుంది. అన్నంలోకి ఈ పచ్చడి చాలా బాగుంటుంది.







## చిన్న చేపలతో

**కావలసినవి :** చిన్న చేపలు-అరకిలో, చింత చిగురు-పావు కప్పు, ఉప్పు-రుచికి సరిపడా, ధనియాలపొడి-చెంచా, పసుపు కొద్దిగా, కారం-మూడు చెంచాలు, టొమాటో-చిన్నది, ఉల్లి పాయలు-మూడు, పచ్చి మిర్చి- నాలుగు, కరివేపాకు-రెండు రెబ్బలు.

**తయారీ :** ముందుగా చేపల్ని శుభ్రంగా కడిగి ఓ గిన్నెలోకి తీసుకోవాలి. ఇప్పుడు చింతాకుని చేత్తో పొడిలా నలిపి అందులోకి వేసుకోవాలి. ఆపై సన్నగా కోసి పెట్టుకున్న ఉల్లిపాయ, పచ్చిమిర్చి ముక్కల్ని, ధనియాల పొడి, కారం, ఉప్పు, పసుపు అన్నీ సంగం చొప్పున అందులో వేసి కలిపి మూత పెట్టి ఓ గంట పక్కనుంచాలి. ఈలోగా పొయ్యి వెలిగించి బాణలీలో ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి వేయించాలి. అవి రంగు మారాక మిగిలిన ఉప్పు, పసుపు, కారం, ధనియాలపొడి వేసి మూతపెట్టేయాలి. కాస్త నూనె పైకి తేలాక కలిపి పెట్టు కున్న చేపల్ని కూడా వేసి గరిటె పెట్టకుండా గిన్నె పైకి ఎత్తి కదపాలి. ఇలా చిన్న మంటమీద కాసూపు మగ్గనిచ్చాక నీళ్ల పోసుకోవాలి. అవన్నీ ఆవిరై కూర దగ్గర పడ్డాక కొంచెం కొత్తిమీర చల్లుకుంటే సరి.

## మటన్‌తో ..

**కావలసినవి :** చింత చిగురు-కప్పు, మటన్-అర కేజీ, ఉల్లిపాయలు-నాలుగు, పచ్చిమిర్చి- ఐదు, ఉప్పు, కారం-రుచికి తగినంత, అల్లం వెల్లుల్లి పేస్ట్-పెద్ద చెంచా, పసుపు- చిటికెడు, ధనియాల పొడి, గరం మసాలా- రెండు పెద్ద చెంచాల చొప్పున, నూనె-కొద్దిగా, జీలకర్ర- చెంచా, బిర్యానీ ఆకులు- మూడు.



**తయారీ :** మటన్‌ని కడిగి పక్కన పెట్టుకోవాలి. తర్వాత చింత చిగురును శుభ్రం చేసుకుని చేతులతో నలిపి పొడి చేసుకోవాలి. ఇప్పుడు, ఉల్లి, పచ్చిమిర్చిలను సన్నగా కోసి పెట్టుకోవాలి. కుక్కర్‌లో కొద్దిగా నూనెపోసి కాగాక.. జీలకర్ర, బిర్యానీ ఆకులు, ఉల్లి, పచ్చిమిర్చి ముక్కలు వేసి రంగు మారే వరకూ మగ్గనివ్వాలి. ఆపై వెల్లుల్లి పేస్టుని చేర్చి పచ్చివాసన పోయే వరకూ ఉంచి, తర్వాత మటన్ వేసి మూత పెట్టాలి.ఇది మగ్గాక ఉప్పు, కారం, పసుపుతో పాటు రెండు నిమిషాలాగి ధనియాలపొడి, గరం మసాలా, కొత్తిమీర తరుగు కూడా చల్లి మూత పెట్టాలి. ఇందులో నీళ్ల పోసి నూనె పైకి తేలే వరకూ మంట మధ్యస్థంగా ఉంచి అడుగంట కుండా తిప్పాలి. అప్పుడు కొన్ని నీళ్ల పోసి మూతకు విజిల్ పెట్టి ఆరు కూతలు వచ్చే వరకూ ఉడికించాలి.చల్లారాక ముక్క ఉడికిందో లేదో చూసి చింత చిగురు కలిపి మరో ఆరేడు నిమిషాలు సిమ్‌లో ఉంచి ఉడకనివ్వాలి. ఈ కూరను వేడి వేడి అన్నంలోకి తింటే భలే రుచిగా ఉంటుంది. దింపేయాలి. □

## నీటి స్వచ్ఛతకు.. !



తాగ దానికి, వంటకు ఉపయోగించే నీళ్ల పరిశుభ్రంగా ఉంటేసగం జబ్బులు రావు. నీటి కాలుష్యాన్ని నివారించ దానికి వాటర్ క్యాన్ తెప్పించుకుంటాం కదా! దానికి వాటర్ డిస్పెన్సర్ బిగిస్తే నీళ్ల పరిశుభ్రంగా ఉంటాయి. వంపడం తేలికవుతుంది. పనయ్యాక తీసి ఇంకోదానికి అమర్చవచ్చు. ఇది మేలురకం ప్లాస్టిక్‌తో రూపొందడం హానికరం కాదు. దీన్ని శుభ్రపరచడమూ సులువే. □

# అమ్మయ్యాక అందంగా ..



అమ్మతనం మనలో ఎన్నో మార్పులు తీసుకొస్తుంది. ఈ దశలో అటు శారీరకంగానే కాదు.. ఇటు సౌందర్య పరంగానూ పలు మార్పులు రావడం గమనించచ్చు. ముఖ్యంగా ముఖంపై మొటిమలు- మచ్చలు, చర్మంపై పిగ్మెంటేషన్-స్ట్రెచ్ మార్క్స్, విపరీతంగా జుట్టురాలి పోవడం.. ఇలా తొలిచూలు వారు అందం పరంగా వివిధ రకాల సమస్యల్ని ఎదుర్కొంటుంటారు. బిడ్డ పుట్టాక తల్లుల శరీరంలో ఈస్ట్రోజెన్, ప్రొజెస్టరాన్. వంటి హార్మోన్ల స్థాయిలు ఒక్కసారిగా పడిపోవడమే ఇందుకు కారణమంటున్నారు నిపుణులు. అలాగని ఈ సమస్యల్ని పరిష్కరించుకోలేమా అంటే.. అందుకు చిన్న చిన్న చిట్కాలను పాటించాలని సూచిస్తున్నారు. మరి, అవేంటో తెలుసుకుందాం..

**ఎలాంటి సమస్యలొస్తాయంటే..**

గర్భిణిగా ఉన్న సమయంలో హార్మోన్ల స్థాయుల్లో పెరుగుదల కారణంగా జుట్టు రాలడం తగ్గిపోతుంది. అదే డెలివరీ తర్వాత హార్మోన్ల స్థాయిలు తిరిగి సాధారణ స్థితికి చేరుకోవడం/ తగ్గుదల వల్ల జుట్టు రాలడం అధికమవుతుంది. అయితే ఇది తాత్కాలికమే అని మహా అయితే 6-12 నెలల పాటు ఈ సమస్య ఎక్కువగా ఉండచ్చంటున్నారు. ప్రసవం తర్వాత హార్మోన్లలో మార్పులు, ఒత్తిడి, అలసట.. వంటివన్నీ ముఖంపై మొటిమలు రావడానికి కారణమవుతాయి. ముఖ్యంగా ఈ దశలో ప్రొజెస్టరాన్ హార్మోన్ స్థాయుల్లో వచ్చే మార్పుల వల్ల సెబేషియస్ గ్రంథులు ఎక్కువ నూనెల్ని విడుదల చేస్తాయి. తద్వారా ముఖంపై మొటిమలు, వాటి తాలూకు మచ్చలు ఏర్పడుతుంటాయి. ప్రసవం తర్వాత సౌందర్యపరంగా వచ్చే మరో సమస్య పిగ్మెంటేషన్/మెలస్మా. ఈ క్రమంలో చర్మంపై నల్లటి ప్యాచుల్లాంటి మచ్చలు ఏర్పడడం గమనించవచ్చు. ఇక బిడ్డ పుట్టాక నిద్రలేమి, హార్మోన్ల స్థాయుల్లో మార్పులు, విపరీతమైన అలసట.. వంటివన్నీ కళ్ల ఉబ్బడం, కళ్లకింది నల్లటి వలయాలు ఏర్పడడం వంటి సమస్యలకు దారితీస్తాయి.

**ఈ చిట్కాలతో తిరిగి అందంగా...** ప్రసవానంతరం ఎదురయ్యే మొటిమల సమస్యను దూరం చేసుకోవలంటే రోజుకు రెండుసార్లు గాఢత తక్కువగా ఉండే క్లెన్సర్‌తో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ఇక ఇలాంటి వారు ఉపయోగించే ఫేస్‌ప్యాక్స్‌లో కలబంద, యూకలిప్టస్ ఆయిల్. వంటి పదార్థాలను చేర్చుకుంటే ఫలితం ఉంటుంది. అంతేకాదు.. బయటికి వెళ్లేటప్పుడు మాయిశ్చరైజర్ రాసుకోవడం తప్పనిసరి. అది కూడా ఆయిల్ రహితమైనదై ఉండాలన్న విషయం గుర్తుపెట్టుకోండి. పిగెమంటేషన్ సమస్యను తొలగించుకోవడానికి ప్రస్తుతం మార్కెట్లో ప్రత్యేకమైన మాయిశ్చరైజర్స్ అందుబాటులో ఉన్నాయి. వాటిని నిపుణుల సలహా మేరకు వాడితే సరి. □

అంతర్వాణి

# క్షమాగుణం ఉండాల్సిందే..

ఒక తండ్రికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అతనికి మిక్కిలి ఆస్తి ఉంది. ఒకరోజు చిన్న కుమారుడు 'నాన్న ఆస్తిలో నాకు రావాల్సిన వాటాను ఇవ్వండి..నేను మీవద్ద ఉండలేను' అని కోరాడు. అందుకు ఆ తండ్రి 'సరే'నని కుమారులిద్దరికీ ఆస్తిని పంచి ఇచ్చాడు. చిన్న కొడుకు ఆస్తిని తీసుకెళ్లి, దూరదేశానికి వెళ్లిపోయాడు. తనవద్ద ఉన్న డబ్బుతో జల్సాలు చేసి, చెడు అలవాట్లతో ఆస్తి మొత్తాన్ని ఖాళీ చేసుకున్నాడు. అతడివద్ద డబ్బు లేకపోవడంతో స్నేహితులందరూ అతడిని వదిలేశారు. దేశంలో అకస్మాత్తుగా కరువు వచ్చింది. ఆ చిన్న కుమారుడు ఆ దేశం లోని ఒక వ్యక్తివద్దకు వెళ్లి ఉద్యోగం ఇవ్వమని అడిగాడు. అతడు తన వద్ద ఉన్న పందుల మందను మేపేందుకు ఆ యువకుడిని నియమించాడు. కరువుతో అతడికి ఎవరూ తిండి పెట్టలేదు. చివరికి పందులు తినేపొట్టుతో తన కడుపు నింపుకోవాలని ఆశించాడు. కానీ అది కూడా దొరకలేదు. అప్పుడు ఆ కుమారుడికి తన తండ్రి గుర్తుకు వచ్చాడు. 'నా తండ్రి వద్ద పనివారు చాలామంది ఉన్నారు, వారు మా నాన్నవద్ద ఆహారాన్ని సమృద్ధిగా తింటున్నారు. నేను అయితే ఆకలితో చచ్చిపోతున్నాను.. కాబట్టి నేను మళ్లీ నాన్న వద్దకు వెళ్లి, క్షమించమని వేడుకుంటాను' అని మనసులో అనుకుని తండ్రి వద్దకు వెళ్లాడు. దూరం నుంచి ఆ తండ్రి చిన్నకుమారుడిని చూచి, ఆదరించాడు. ఆనందంతో గొప్ప వేడుకలను చేశాడు. పొలం నుంచి ఇంటికి వచ్చిన పెద్ద కుమారుడు ఇంట్లో జరుగుతున్న వేడుకల్ని చూశాడు. కోపంతో అలిగి, బయటికి వెళ్లిపోయాడు. నాన్న బ్రతిమిలా డినా లోపలికి రాడు. తండ్రికి క్షమాగుణం అన్నకు లేదు. తన తమ్ముడు చెడిపోతే, జాలితో ఆదరించి, సరి చేసేందుకు ప్రయత్నించలేదు. నేడు చాలా మంది క్రైస్తవులు ఇలాగే ఉన్నారు. ఇంట్లోనే ఉంటారు, తల్లి దండ్రుల వద్ద జీవిస్తారు. కానీ అమ్మానాన్నల మనసును గ్రహించ లేరు. సొంత తోబుట్టువులను చేరదీసి, ఆశ్రయాన్ని ఇవ్వలేరు. తమ్ముడు పాపం చేశాడు, తగిన శాస్తి జరిగిందని అనుకుంటున్నాడు. తానే నీతిమంతుడిగా అనుకున్నాడు. కానీ చివరికి తప్పు చేసిన చిన్న కుమారుడు ఇంట్లోకి ప్రవేశిస్తే, నీతిమంతుడిగా భావిస్తున్న పెద్దకుమారుడు వెలుపలనే ఉండిపోయాడు. 'తన సహోదరుని మీద కోపపడు ప్రతివాడు విమర్శకు లోనగును.. ద్రోహీ అని చెప్పువాడు నరకానికి లోనగును' (మత్తయి 5:22). కాబట్టి అందరినీ ప్రేమిద్దాం, క్షమించేందుకు వెనుకడుగు వేయవద్దు. - పి.వాణిపుష్ప

# తెర

## హర్ష్ రోషన్, ప్రియాంక ఆచర్ జంటగా నూతన చిత్రం ప్రారంభం



తెలుగు సినిమా రంగంలో ఐకానిక్, పేరెన్నికగన్న నిర్మాణ సంస్థల్లో ఒకటైన ఈవీవీ సినిమా ప్రతిష్మాత్మకంగా తాజాగా ఓ వైవిధ్యమైన కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. లెజెండరీ దర్శకుడు ఈ.వి.వి. సత్య నారాయణ స్థాపించిన ఈ బ్యానర్‌పై గతంలో చాలా బాగుంది, మా ఆవిడ మీద ఒట్టు మీ ఆవిడ చాలా మంచిది, 'తొట్టి గ్యాంగ్', 'అత్తిలి సత్తిబాబు ఎల్‌కేజీ', 'ఫిట్టింగ్ మాస్టర్', నువ్వంటే నాకిష్టం, కితకితలు వినోదాత్మక చిత్రాలు ప్రేక్షకులను అలరించాయి. ఇప్పుడు ఈ లెజెండరీ బ్యానర్‌పై ఈవీవీ గారి తనయుడు ఆర్యన్ రాజేష్ మరో నిర్మాత ఎన్.వి. కృష్ణారెడ్డి తో కలిసి ఓ సినిమా నిర్మంచబోతున్నారు. నిజ జీవిత కథ ఆధారంగా ఓ ఇంటెన్స్ లవ్ డ్రామాగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో హర్ష్ రోషన్ హీరోగా, ప్రియాంక ఆచర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. కోర్ట్ చిత్రంతో మంచి ప్రశంసలు అందుకున్న హర్ష్ రోషన్, తెలుగు సినిమాలో ప్రతిభావంతులైన యువ నటుల్లో ఒకరిగా గుర్తింపు పొందారు. ఇప్పుడు మరో భావోద్వేగ కథతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు.ఈ చిత్రానికి అరుణ్ బాలాజీ, శ్రీ రంజని సంయుక్తంగా దర్శకత్వం వహిస్తారు. నిజ జీవిత భావోద్వేగాలు, సంబంధాల నేపథ్యంలో ఈ ప్రేమకథను వారు రూపొందించారు. ఈ సినిమా ఇటీవల శుభ ముహూర్తంలో పూజా కార్యక్రమంతో ప్రారంభమైంది.

## 10న తెలుగులో యాక్షన్ థ్రిల్లర్ 'ఐ, నోబడీ'



మలయాళ టాప్ స్టార్ పృథ్వీ రాజ్ సుకుమారన్ కి తెలుగు లోనూ మంచి ఫాలోయింగ్ ఉంది. రెగ్యులర్ మాస్ మసాలా సినిమాలు కాకుండా తనకంటూ ఒక ప్రత్యేకమైన శైలిలో సినిమా లు చేస్తుం టారు. రాజమౌళి మహేష్ బాబు కాంబినేషన్లో రూపొందుతున్న ప్రఖ్యాత చిత్రం వారణాస్ని లో కూడా ఆయన ఒక కీలక పాత్ర పోషిస్తున్నారు. పృథ్వీరాజ్ సుకుమారన్ తాజాగా నటించిన చిత్రం 'ఐ, నోబడీ' విభిన్న కథాంశాలతో ప్రేక్షకులను అలరిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న దర్శకుడు నిస్సాం బషీర్ దర్శకత్వంలో జాతీయ అవార్డు గ్రహీత పార్వతి తిరువోతుతో కలిసి పృథ్వీరాజ్ సుకుమా రన్ నటించిన అత్యంత ఆసక్తికరమైన యాక్షన్ థ్రిల్లర్ 'ఐ, నోబడీ' జూలై 9న మలయాళంలోనూ, జూలై 10న తెలుగులోనూ గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్ ఈ సినిమాపై భారీ అంచనాలను నెలకొల్పాయి. ఒక సాధారణ బ్యాంకు ఉద్యోగి రాజు జీవితంలో అనూహ్యంగా జరిగిన సంఘటనలతో కథ ప్రారంభమవుతుంది. భావోద్వేగాలు, సస్పెన్స్, యాక్షన్ అంశాలను సమపాళ్లలో మేళవించిన ఈ చిత్రం ప్రేక్షకులను ఆద్యంతం ఉత్కంఠకు గురిచేసేలా రూపొందింది. .పృథ్వీరాజ్ సుకుమారన్, పార్వతి తిరువోతు, హకీమ్ షాజహాన్, అశోకన్ తదితరులు నటించిన ఈ చిత్రానికి దర్శకత్వం: నిస్సాం బషీర్, కథ - స్క్రీన్‌ప్లే - సంభాషణలు: సమీర్ అబ్దుల్, ఛాయాగ్రహణం: దినేష్ పురుషోత్త మన్ , సంగీతం: జేక్స్ బిజాయ్, నిర్మాతలు: ముకేష్ ఆర్ మెహతా, సుప్రియా మీనన్, సి.వి.సారథి.9న పెయిడ్ ప్రీమియర్స్ తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రానికి మంచి క్రేజ్ ఉండడంతో, ఈ నెల 9 న పెయిడ్ ప్రీమియర్స్ ప్లాన్ చేస్తున్నారు నిర్మాతలు.

## '666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్' టీజర్ విడుదల



ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న '666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్' టీమ్... మీడియాకు టీజర్‌ని ప్రదర్శించింది. ఈ కార్యక్రమంలో సినిమాలో నటించిన ఇతర నటీనటులతో పాటు డా. శివరాజ్‌కుమార్, డాలీ ధనంజయ, ప్రియాంక మోహన్, అదితి బాలన్, దర్శకుడు హేమంత్ ఎం.రావు, నిర్మాత వైశాక్ జె గౌడ, ఛాయాగ్రాహకుడు అద్వైత గురుమూర్తి, సంగీత దర్శకుడు చరణ్ రాజ్, ప్రొడక్షన్ డిజైనర్ విశ్వాస్ కశ్యప్ పాల్గొన్నారు. టీజర్‌లో '666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్' మూవీ వరల్డ్‌ని అద్భుతంగా చూపించారు. చిత్రాన్ని స్పై డ్రామాగా తెరకెక్కించారు. లెజెండరీ డా.రాజ్‌కుమార్ 'సీఐడీ999'ని గుర్తుచేస్తూ, నివాళులర్పించేలా ఉందిప్రతి ఫ్రేమ్‌లోనూ తన దర్శకత్వ ప్రతిభను చూపించారు హేమంత్‌రావు. నటీనటుల నుంచి, టెక్నీషియన్ల నుంచి అత్యంత గొప్ప ప్రతిభను రాబట్టుకున్నారు. ఈ ఏడాది విడుదలవుతున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రాల్లో '666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్'కి ప్రత్యేక స్థానం ఉంది. ఈ సినిమాను హేమంత్ ఎం రావు డైరక్ట్ చేశారు. వైశాఖ్ జె గౌడ నిర్మించారు. వైశాఖ్ జె ఫిల్మ్స్ పతాకంపై తెరకెక్కింది. చరణ్ రాజ్ సంగీతం అందించారు. అద్వైత్ గురుమూర్తి ఛాయాగ్రాహకుడిగా పనిచేశారు. విశ్వాస్ కశ్యప్ ఈ సినిమాకు ప్రొడక్షన్ డిజైనర్‌గా వ్యవహరించారు. సురేష్ కాస్ట్యూమ్స్ ఇన్‌ఛార్జ్‌గా పనిచేశారు. టీజర్ విడుదల కార్యక్రమంలో దర్శకుడు హేమంత్ ఎం.రావు మాట్లాడుతూ 'నా తొలి చిత్రం గోది బన్నా సాధారణ మైకట్టు'కి నిర్మాతను వెతుక్కోవడానికి నేనెంతో కష్టపడ్డాను. పదేళ్ల సినిమా జర్నీలో నాకు వైశాఖ్ జె గౌడలాంటి గొప్ప నిర్మాత దొరికారు. నిర్మాత వైశాఖ్ జె గౌడ మాట్లాడుతూ 'పదకొండేళ్లప్పటి నుంచి నేను సినిమాలకు పెద్ద ఫ్యాన్‌ని. మరీ ముఖ్యంగా శివన్నకు వీరాభిమానిని. ఆయన సినిమాలు చూస్తూ పెరిగాను. నాకు అత్యంత స్ఫూర్తిని పంచిన హీరో. కన్నడ సినిమా ఇండస్ట్రీకి 92 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణం ఉంది. అన్నారు. డా. శివరాజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి లెజెండరీ యాక్టర్‌కీ ఓ గురువుండాలి. దర్శకులు అలాంటి పాత్రనే పోషిస్తుంటారు.

## 'శ్రీనివాస మంగాపురం' 30న గ్రాండ్‌గా రిలీజ్



'శ్రీనివాస మంగాపురం' 30న గ్రాండ్‌గా రిలీజ్ సూపర్ స్టార్ కృష్ణ మనవడు, మహేష్ బాబు అన్న కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని అజయ్ భుపతి దర్శకత్వంలో 'శ్రీనివాస మంగాపురం' సినిమాతో హీరోగా పరిచయం అవుతున్నారు. బాలీవుడ్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడానిని కూడా ఈ చిత్రం ద్వారా తెలుగు ప్రేక్షకులకు పరిచయం చేస్తున్నారు. ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో సీనియర్ నటుడు డాక్టర్ మోహన్ బాబు పవర్ ఫుల్ పాత్రను పోషిస్తున్నారు. నిర్మాత పి. కిరణ్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని అశ్వినిదత్ సమర్పిస్తున్నారు. ఈ రోజు చిత్ర బృందం సినిమా విడుదల తేదీని ప్రకటించింది. ఈ చిత్రం జూలై 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. అజయ్ భూపతి శ్రీనివాస మంగాపురంను సరికొత్తగా తెరకెక్కిస్తు న్నారు. తన మార్క్ ఇంటెన్సిటీకి అందమైన ప్రేమకథ, పవర్‌ఫుల్ యాక్షన్‌ను జోడిస్తూ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రం అత్యున్నత సాంకేతిక విలువలతో రూపొందుతోంది. జయకృష్ణ ఐఎస్‌సి సినిమాటోగ్రఫీని నిర్వహించగా, జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. మాధవ్ కుమార్ గుళ్ళపాటి ఎడిటర్‌గా వ్యవహరి స్తుండగా, సాహి సురేష్ ప్రొడక్షన్ డిజైనర్. రిలీజ్ డేట్ అనౌన్స్ చేయడంతో ప్రచార కార్యక్రమాలను మరింత ముమ్మరం చేయడానికి చిత్ర బృందం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

## 'కామాఖ్య' నుంచి 'ఏముందో ఏమో'సాంగ్ రిలీజ్



సమైరా, సముద్రఖని, అభిరామి ప్రధాన పాత్రల్లో అభినయ కృష్ణ దర్శకత్వంలో రూపొందుతున్న థ్రిల్లింగ్ 'కామాఖ్య'. మై ఫిల్మ్ ప్రొడక్షన్స్ PVT LTD బ్యానర్ పై వడ్డేపల్లి శ్రీ వాణీనాథ్, యశ్వంత్ రాజ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్, టీజర్, ఫస్ట్ సింగిల్ కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ ఏముందో ఏమో సాంగ్ ని రిలీజ్ చేశారు.ఈ హార్ట్ టచింగ్ మెలోడీ ప్రేమ, ఎదురుచూపుల భావాలను ఎంతో అందంగా ఆవిష్కరిస్తుంది. హరి చరణ్ హృదయాన్ని తాకే వాయిస్‌తో పాడిన ఈ పాటకు జ్ఞాని మధురమైన ట్యూన్ అందించారు. అనంత శ్రీరామ్ రాసిన అర్థవంతమైన లిరిక్స్ ఈ సాంగ్‌కు మరింత అందాన్ని తీసుకొచ్చాయి. ఈ చిత్రానికి రమేష్ కుశేందర్ రెడ్డి డీవోపీ, వరప్రసాద్ ఎడిటర్.

## 'కిల్లర్' నుంచి జ్యోతి పూర్వజ్ బర్త్ డే పోస్టర్ విడుదల



బిజినెస్ సర్కిల్స్‌లో ఆసక్తి కలిగిస్తున్న మూవీ, బిగ్ డిస్ట్రిబ్యూటర్స్, బయ్యర్స్‌తో జరుగుతున్న బిజినెస్ డిస్కషన్స్ త్వరలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతున్న 'కిల్లర్' సినిమా జ్యోతి పూర్వజ్, పూర్వాజ్, లీడ్ రోల్స్‌లో నటిస్తున్న సెన్సేషనల్ సై ఫై థ్రిల్లర్ మూవీ 'కిల్లర్'. మనీష్ గిలాడా, చంద్రకాంత్ కొల్లు, విశాల్ రాజ్, అర్చన అనంత్, గౌతమ్ చక్రధర్ కొప్పిశెట్టి ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాను ధ్యానం నాన్న ఆశీస్సులతో థింక్ సినిమా, ఏయూ అండ్ ఐ స్టూడియోస్ బ్యానర్స్ పై పూర్వాజ్ , పద్మనాభ రెడ్డి.ఎ. నిర్మిస్తున్నారు. ఉర్వీశ్ పూర్వజ్ సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. పూర్వాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. వీఎఫ్‌ఎక్స్ వర్క్స్ సహా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలన్నీ పూర్తి చేసుకున్న ఈ మూవీ త్వరలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది.ఈ రోజు సూపర్ టాలెంటెడ్ హీరోయిన్ జ్యోతి పూర్వజ్ బర్త్ డే సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు తెలియజేస్తూ 'కిల్లర్' చిత్రం నుంచి స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు'కిల్లర్' సినిమాలో ప్రేక్షకులు మర్చిపోలేని ఒక ప్రపంచాన్ని డైరెక్టర్ పూర్వాజ్ క్రియేట్ చేస్తున్నారు. ఆయన ఈ సినిమాకు దర్శకత్వం వహించడంతో పాటు సీఎన్‌పి ఇంటిగ్రేషన్, రాయ్ ప్రోటోకాల్ కోసం వర్క్ చేసే సైంటిస్ట్‌గా కనిపించబోతున్నారు. 'కిల్లర్' సినిమా ప్రోగ్రెస్ గురించి డైరెక్టర్ పూర్వాజ్ మాట్లాడుతూ మా 'కిల్లర్' సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. భారీ వీఎఫ్‌ఎక్స్ షాట్స్ ఉండటం వల్ల కొంచెం ఎక్కువ సమయం పట్టింది. ఇప్పుడు వీఎఫ్‌ఎక్స్ వర్క్స్ కూడా పూర్తయ్యాయి.

## సర్ ప్రక్రియను వేగవంతం చేయండి : తహశీల్దార్

**కోట, జూలై 4 ప్రభాతవార్త** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను వేగవంతం చేయాలని తహశీల్దార్ కె.జయ జయరావు సూచించారు. శనివారం ఆయన చిట్టేడు,కర్లపూడి, కేశవరం గ్రామాల్లోని బిఎల్ఓల పనితీరుపై పరిశీలించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ రోజువారీ లక్ష్యాలను పూర్తి చేయాలని కోరారు. ఆన్ లైన్ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న ప్రక్రియను పరిశీలిస్తున్నారు.ఈఎఫ్‌లను తిరిగి అందజేయాలని ఓటర్లకు సూచిస్తున్నారు.ఆదివారం కూడా ఫారాలను డిజిటలైజ్ ప్రక్రియ డ్రైవ్ నిర్వహిస్తున్నామని చెప్పారు.ఫారాలు అందని వారికి అందజేసి అక్కడిక్కడే వారితో నింపించి తిరిగి తీసుకోవడం జరుగుతుందన్నారు. అన్ని సచివాలయాల్లో యుద్ద ప్రాతిపదికన దీని చేపడుతున్నామని తమిసీల్దార్ జయజయరావు చెప్పారు.ప్రజలు కూడా అదికారులకు సహకరిస్తే సర్ ప్రక్రియను నిర్ణయత గడువులోపే పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికీ మండలంలో 17,137 ఓటర్లను డిజిటలైజేషన్ 40 శాతం పూర్తి చేశామన్నారు.



## ప్లాస్టిక్ రహిత సమాజాన్ని స్థాపిద్దాం

### వవ్వేరు బ్యాంకు చైర్మన్ దొడ్ల విజయలక్ష్మీ

**బుచ్చి జులై 4 ప్రభాతవార్త** ప్లాస్టిక్ రహిత సమాజాన్ని చూసేందుకు ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాలని వవ్వేరు బ్యాంకు చైర్మన్ దొడ్ల విజయలక్ష్మీ విజ్ఞప్తి చేశారు. బుచ్చిరెడ్డిపాళెంలోని ది వవ్వేరు కోఆపరేటివ్ రూరల్ క్రెడిట్ సొసైటీ ( బ్యాంకు కో ఆపరేటివ్ బ్యాంకు ) లో జరిగిన ప్లాస్టిక్ రహిత సమాజం అనే కార్యక్రమంలో ఆమె మాట్లాడుతు ప్లాస్టిక్ వల్ల అనేక అనా ర్థాలు ఉన్నాయని ఆమె తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ప్లాస్టిక్ బూతాన్ని తరిమేందుకు అనేక ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆమె తెలిపారు. మన వంతుగా ప్లాస్టిక్ కవర్ల వాడకన్ని నిలిపివేదామని ఆమె సూచించారు. అనంతరం డైరక్టర్ మద్దసాని మా ల్యాద్రి మాట్లాడుతు ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా వున్న సమస్య ప్లాస్టిక్ అని ఆయన తెలిపారు. ప్లాస్టిక్ వల్ల పర్యావరణంలో కూడా మార్పులు వస్తున్నాయని,భావితారలకు ఇది చాలా ఇబ్బంది కరమని ఆయన తెలిపారు.ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ వాడకాన్ని ఆపివేయాలని ఆయన కోరారు.ఈకార్యక్రమంలో డైరక్టర్ కోవూరు పద్మ,సిఇఒ తుమ్మల నరసయ్య, మాజీ సిఇఒ మన్నార్స శ్రీనివాసులు, రైతులు పాల్గోన్నారు.



## బిజెపి బుచ్చిరెడ్డిపాళెం రూరల్ మండల పధాధికారుల సమావేశం

**బుచ్చి జులై 4 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం రూరల్ మండల అద్యక్షులు సిద్దన మనోహర్‌రెడ్డి అద్యక్షతన మండల పధాధికారుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధులుగా బిజెపి నెల్లూరు జిల్లా అద్యక్షులు శీపారెడ్డి,వంశీదర్‌రెడ్డి,దళిత మోర్చ జిల్లా అద్యక్షులు మరియు రూరల్ మండల ఇంచార్జి దువ్వూరు శ్రీనివాసులు హజరైయ్యారు.ఈ సందర్బంగా వంశీదర్‌రెడ్డి మాట్లాడుత మం డలంలోని పధాధికారులందరు వారి వారి ప్రాంతాల్లో ఉన్న బిఎల్ఎ -2లను సమన్వయం చేసుకుంటు ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని వేగవంతం చేసే దిశగా పనిచేయాలన్నారు. అదే విధంగా 6 వ తేదిన జాతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్‌శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్క రించుకొని ప్రతి పోలింగ్ బూత్‌లో వారి చిత్రపటానికి నివాళులర్పించి వారి ఆశయ సాధన కొరకు కృషి చేయాలని పిలుపు నిచ్చారు.ఈ సమావేశంలో బిజెపి ఓబిసి మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గండి రఘురామయ్య, కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యదర్శి చేవూరు వినయ్ నారాయణ,ఓబిసి మోర్చ తిరుపతి ఇంచార్జి గంజం పెంచల ప్రసాద్,సీనియర్ నాయకులు వన్నెపంట బాలరాఘవరెడ్డి, ఓబిసి మోర్చ ఐటి సెల్ కో కన్వీనర్ గెండి వీరనారాయణ, మండల ప్రధాన కార్యదర్శులు పెజ్జాయి క్రిష్ణారెడ్డి, అల్లం మస్తానయ్య, మండల ఉపాధ్యాక్షులు మావూలూరు అశోక్‌రెడ్డి చీమల హరినారాయణ, పైడాల వెంకటేశ్వర్లరెడ్డి, గెండి పెంచలకృష్ణ,మండల సోషల్ మీడియా కన్వీనర్ పెజ్జాయి ప్రసన్నకుమార్‌రెడ్డి,నాయకులు కోనేరు శ్రీనివాసులు, గుడి అంకయ్య, పసుపులేటి శ్రీరాములు తదితరులు పాల్గోన్నారు.



## 19న సనాతన ధర్మం,పురాణ ఇతిహాసాలపై ప్రశ్నావళి

**నెల్లూరు, జులై 4 ప్రభాతవార్త-విద్య** తమ పీఠం ఆధ్వర్యంలో ఈనెల 19న విద్యార్థులకు హైందవధర్మం, పునాణ ఇతిహాసాలు,ఆధారిత ఆధ్యాత్మిక జ్ఞాన , విజ్ఞాన అంశావలిపై ప్రశ్నావళి కార్యక్రమాన్ని నిర్వహించ నున్నామని అవధూత దత్తపీఠం నిర్వాహకులు, ప్రముఖ వైద్యులు సర్వేపల్లి అజయ్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన ప్రభాతవార్తతో మాట్లాడారు. విద్యార్థులు, చిన్నారులకు హిందూ సంస్కృతి, సాంప్రదాయాలు, పురాణాలు, ఇతిహాసాలు, హైందవ ధర్మంపై అవగాహన కల్పిచేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహద పడతాయన్నారు.ఈ పోటీల్లో పాల్గొని విజేతలైన వారికి బహుమతులతోపాటూ సర్టిఫికేట్స్‌ను పంపిణీచేయటం జరుగుతుందన్నారు. 1నుండి 5వ తరగతి వరకు, 6నుండి 10వ తరగతి వరకు, ఇంటర్, డిగ్రీ , పిజీ విద్యార్థులకు విడివిడిగా ప్రశ్నావళి ఉంటుందని మరిన్ని వివరాలకు 9441548655 నెంబర్‌కు కాల్ చేయ్యాలని ఆయన కోరారు.



## 7న కృష్ణచైతన్న డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ ఫెయిర్

**నెల్లూరు, జులై 4 ప్రభాతవార్త-విద్య** జులై 7న నగరంలోని స్థానిక కృష్ణ చైతన్య డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ ఫెయిర్‌ను నిర్వహింస్తున్నామని విద్యాసంస్థల చైర్మన్ ఆర్‌వి.కృ ష్ణారెడ్డి, డైరెక్టర్ పర్వతరెడ్డి రాణా ప్రమోద్‌రెడ్డిలు పేర్కొన్నా రు.శనివారం స్థానిక కళాశాలలో జాబ్‌ఫెయిర్‌కు సంబందించిన పోస్టర్‌ను ఆవిష్కరిం చారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతు ఈ మేళాలో ఐటి, నాన్ ఐటి, బ్యాంకింగ్, మానుఫ్యాక్చరింగ్, ఫార్మా, తదితర రంగాలకు చెందిన అనేక కంపెనీలు వారి వారి కంపెనీల్లో ఉద్యోగాలకు ఇంటర్యూలు నిర్వ హించటం జరుగుతుందన్నారు. సుమారు 1300 ఉద్యోగ అవకాశాలు కల్పించటమే లక్ష్యంగా ఈ మేళాలు చేపడుతున్నామన్నారు. జిల్లాలోని విద్యార్థులతోపాటూ నిరుద్యోగ యువత ఎవ్వరైనా ఈ కార్యక్రమంలో పాల్గొన వచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు తమ కళాశాలలో సంప్రదించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో డీన్ సుధారాణి, పరీక్షల నిర్వహణ సెల్ కన్వీనర్ టి.జ్యోతి, సిబ్బంది భాను చంద్రారెడ్డి, రాధిక, పవన్ తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధి పథంలో పడుగుపాడు సహకార సొసైటీ

**కోవూరు, జులై 4 ప్రభాతవార్త :** కోవూరులోని శాంతినగర్‌లో ఉన్న పడుగుపాడు సహకార సొసైటీ ఇప్పటికే అభివృద్ధి పథంలో పయని స్తోందని నాబార్డు డీడీఎం పి. బాబు తెలిపారు. శాంతినగర్‌లో ఉన్న సొసైటీ కార్యాలయాన్ని శనివారం ఆయన పరిశీలించారు. మాట్లాడుతూ జిల్లాలోని కోవూరులో ఉన్న ఈ పడుగుపాడు సహకార సొసైటీకి నాబార్డు ద్వారా పెద్దఎత్తున నిధులు మం జూరు కానున్నాయన్నారు. సొసైటీకి సంబంధించి ఇనమడుగులో ఉన్న సొసైటీ స్థలంలో 2500 మెట్రిక్ టన్నుల గోదాము నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నాబార్డు ద్వారా నిధులు మంజూరు కానున్నాయన్నారు. తద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ గోదా ము నిర్మాణం పూర్తయితే అనేక రకాల కార్యక్రమాలు చేపట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ సొసైటీ ఇప్పటికే రైతుల సేవలో తరిస్తుందన్నారు. బంగారు ఆభరణాలపై రుణాలు అందించడం, పెట్రోల్ బంక్ ఏర్పాటు , రైతులకు అవసరమైన యూరియా తదితర వాటి అమ్మకాలు చేపట్టడంతో ఈ సొసైటీ ముందుకు సాగుతుందన్నారు. శనివారం లార్జెస్ట్ గ్రైన్ స్టోరేజ్‌పై వర్క్‌షాప్ నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన సొసైటీ సీఈవో గోవర్ధన్‌రెడ్డి ద్వారా సొసైటీకి సంబంధించిన పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఉద్యోగులు శివకుమార్, సనత్, శ్రీరామ్, తదితరులు ఉన్నారు.





## కారును ఢీకొట్టిన ట్రాక్టర్

**కోట,జులై 4 ప్రభాతవార్త** చంద్రశేఖపురం గ్రామం వద్ద శనివారం ఓ కట్టెల లోడుతూ వస్తున్న ట్రాక్టర్ ఎదురుగా వస్తున్న కారును ఢీకొంది.దీంతో ట్రాక్టర్ బోల్తా కొట్టింది.కారులో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలు అయ్యాయి. కోట నుంచి గూడూరు వైపు కట్టెల లోడుతో ట్రాక్టర్ వేళ్లతుంది. గూడూరు నుంచి కోట వైపు వస్తున్న కారును ఆ ట్రాక్టర్ ఢీకొంది. ఆమేరకు పోలీసులు విచారణ జరుపుతున్నారు.

## జడ్పీలులో పదోన్నతులు

**నెల్లూరు, జులై 4, ప్రభాతవార్త – కలెక్టరేట్** జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇద్దరూ రికార్డ్ అసిస్టెం ట్లకు జూనియర్ సహాయకులుగా, 8 మంది ఆఫీస్ సబ్ ఆర్డినేట్లకు రికార్డు అసిస్టెంట్లుగా పదోన్నతి లభిం చింది జడ్పీ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ, జెడ్పీ సీఈవో డి వసుమతి, డిప్యూటీ సిఈఒ వై. బ్రహ్మయ్య ఉత్తర్వులు అందజేశారు. పై ఉత్తర్వులు సహకరించిన చైర్మన్ సీఈఓ, డిప్యూటీ సీఈఓకి ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్ట్రీయల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు లక్కాకుల పెంచలయ్య, కార్యదర్శి దేవా ప్రసన్నకుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కె ముజీబ్, నాలుగోగా తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు కె. భీమ్ రెడ్డి, ఎస్‌కె. మా బాషా తదితరులు పాల్గొన్నారు.



## 6 నుంచి 11 వరకు డిపార్ట్‌మెంటల్ పరీక్షలు

### - పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి - డిఆర్‌వో విజయ్ కుమార్

**నెల్లూరు, జూలై 4, ప్రభాతవార్త – కలెక్టరేట్** మే-2026 సెషన్‌కు సంబంధించిన డిపార్ట్‌మెంటల్ పరీక్షలు (నోటిఫికేషన్ నెం.03/2026) ఈ నెల 6వ తేదీ నుంచి 11వ తేదీ వరకు జిల్లాలో నిర్వహించను న్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి విజయ్ కుమార్ తెలిపారు. శనివారం కలెక్టరేట్లోని డిఆర్‌ఓ ఛాంబర్‌లో డిపార్ట్మెంటల్ పరీక్షల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో డిఆర్‌ఓ విజయ్ కుమార్ కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఓ మాట్లాడుతూ జిల్లాలోని నెల్లూరులో రెండు, కావలిలో ఒకటి కలిపి మొత్తం మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. అభ్యర్థులు పరీక్ష ప్రారంభానికి ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఉదయం సెషన్‌కు ఉదయం 9.15 గంటల తర్వాత, మధ్యాహ్నం సెషన్‌కు మధ్యాహ్నం 2.15 గంటల తర్వాత పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల్లో మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, బ్లూటూత్ పరికరాలు, ఇతర ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు పూర్తిగా నిషేధం అని తెలిపారు. పరీక్షల్లో మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడినట్లయితే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరీక్షల నిర్వహణలో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి పరీక్షలను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



## చిలకపాటిని పరామర్శించిన ఎమ్మెల్యే

**కావలి, జులై 4 ప్రభాతవార్త :** కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి శిష్యుడు చిలకపేట మనోహర్ గత కొన్ని రోజులుగా ఆరోగ్య సమస్యతో బాదపడుతూ విజయవాడలోని ఓ వైద్యశాలలో కంటి ఆపరేషన్ చేయించుకుని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ సందర్బంగా శనివారం ఎమ్మెల్యే ఆయనను పరామర్శించి కంటి ఆపరేషన్ జరిగిన తీరుతో పాటు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొన్నారు. ఎమ్మెల్యే వెంట పట్టణ టిడిపి అధ్యక్షులు గుత్తికొండ కిషోర్‌బాబు, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబూరావు, రూరల్ మండల అద్యక్షులు ఆవుల రామక్రిష్ణ, టిడిపి నాయకులు జనిగర్ల మహేంద్ర యాదవ్, దావులూరి దేవకుమార్, వల్లేరి వెంకట కిరణ్‌కుమార్, తదితర టిడిపి నాయకులు పాల్గొన్నారు.



## మంత్రి ఆనం, ఎమ్మెల్సీ బీదలను సత్కరించిన ఎమ్మెల్యే దగుమాటి

**కావలి, జులై 4 ప్రభాతవార్త :** కావలి పట్టణంలోని విశ్వోదయ ఇంజనీరింగ్ కళాశాల గ్రాడ్యుయేషన్ కార్యక్రమానికి శనివారం రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్సీ బీద రవిచంద్రయాదవ్‌లు కావలి పట్టణానికి విచ్చేసిన సందర్బంగా ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డితో ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా బేటీకావడం జరిగింది. వీరిని ఎమ్మెల్యే శాలువాలతో ఘనంగా సత్కరించడం జరిగింది. అనంతరం పలు కీలకమైన అంశాలు నేతల మధ్య చర్చకు వచ్చినట్లు విశ్వసనీయ సమాచారం.





## పేద ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు ముంగిటికే

**కోవూరు, జులై 4 ప్రభాతవార్త :** పేద ప్రజలకు కంటికి సంబంధించి నాణ్యమైన వైద్య సేవలను వారికి అందుబాటులో ఉంచేలా వీపీఆర్ ఫౌండేషన్ అధినేతలు ఎంపీ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిలు ప్రత్యేక దృష్టి పెట్టారని జొన్నవాడ దేవస్థాన చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి అన్నారు. కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం గ్రామంలో శనివారం వీపీఆర్ నేత్ర సేవలను గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు పైసా ఖర్చు లేకుండా వీపీఆర్ నేత్ర ద్వారా ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలను ఉచితంగా అందజేసేలా వారు చొరవ తీసుకుంటున్నారన్నారు. పార్టీలకతీతంగా ఇటువంటి సామాజిక సేవా కార్యక్రమాలను చేపడుతున్న వేమిరెడ్డి దంపతులకు గ్రామ ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపు తున్నామన్నారు. సోమవారం సైతం వీపీఆర్ నేత్ర సేవలు గ్రామంలో అందుబాటులో ఉంటాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీటీసీ సభ్యుడు నాగరాజు తెలిపారు. అనంతరం కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ మాజీ సభ్యులు జహంగీన్, మాజీ సర్పంచ్ కృష్ణప్రసాద్, టీడీపీ సీనియర్ నాయకులు జీవీ నాగరాజు, కొల్లారెడ్డి ఆదిశేషారెడ్డి, ప్రసాద్, వహీద్, తదితరులు ఉన్నారు.





## సామాజిక సేవలో ఆత్మ సంతృప్తి ఉంది

**కోవూరు, జులై 4 ప్రభాతవార్త :** నిరుపేద గిరిజనులకు సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా చీరలు పంపిణీ చేయడం తమకెంతో ఆత్మ సంతృప్తిగా ఉందని టీడీపీ సీనియర్ నాయకుడు గూటూరు శ్రీధర్‌నాయుడు తెలిపారు. కోవూరు మండలం గంగవరం పంచాయతీ గ్రామ దేవత పక్కేశమ్మ దేవాలయంలో శనివారం శ్రీధర్‌నాయుడు దంపతులు, కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి సంబంధించి చీరలను వేలంపాటలో పూర్తిగా కొనుగోలు చేసి వాటిని పేద గిరిజనులకు పంపిణీ చేశారు. మాట్లాడుతూ గ్రామ దేవత పక్కేశమ్మ ఆశీస్సులతో ఇటువంటి సామాజిక సేవా కార్యక్రమాలను తరచుగా నిర్వహిస్తూనే ఉన్నామన్నారు. గూటూరు మల్లికార్జున నాయుడు దంపతులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఘనంగా కందుకూరు ఏఎంసీ పాలకమండలి ప్రమాణ స్వీకారం

**నెల్లూరు, జూలై 4, ప్రభాతవార్త – వైద్యం** ప్రకాశం జిల్లాలోని కందుకూరు ఏఎంసీ పాలకమండలి ప్రమాణ స్వీకారం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి హాజరై ఏఎంసీ పాలకమండలి నూతన చైర్మన్ రాయపాటి సుభాషిణి, కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేసి ప్రజా మన్ననలు పొందాలన్నారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా సమర్థవంతంగా పనిచేస్తూ, వ్యవసాయ మార్కెట్ కమిటీపై రైతుల్లో మరింత విశ్వాసం పెంపొందించేలా కృషి చేయాలని సూచించారు. రైతులకు మెరుగైన సేవలు అందించి, వారి మన్ననలు పొందే విధంగా బాధ్యతలు నిర్వహించాలని తెలిపారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన రాయపాటి సుభాషిణికి, కమిటీ సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## ఓవెల్‌లో పాఠశాలలో క్యాబినెట్ ఎన్నికలు

**నెల్లూరు, జులై 4 ప్రభాతవార్త-విద్య** నగరంలోని స్థానిక అన్నమయ్య సర్కిల్‌లోని ఓవెల్‌స్కూల్ లో శనివారం 2026-2027 విద్యాసంవత్సరానికి స్కూల్‌క్యాబినెట్ ఎన్నికలను 1నుండి 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా విద్యాసంస్థల చైర్మన్ రంగిశెట్టి వేణు పాల్గొని ప్రజాస్వామ్యంలో ఎన్నికలు, ఓటు హక్కుకు ఉన్న విలువలను విద్యార్థులకు వివరించారు. వి ద్యార్థి దశనుండే చిన్నారులకు ఎన్నికల నిర్వహన, ఓటుహక్కుపై అవగాహ కల్పించేందుకు ఇటువంటి కా ర్యక్రమాలు దోహదపడతాయన్నారు. అప్పుడే ఉత్తమమైన నాయకులను ఎన్నుకోవటం సాధ్యప డు తుం దన్నారు. అనంతరం హెడ్‌బాయ్ , గర్ల్, డిప్యూటీ హెడ్ బాయ్,గర్ల్, సిపిఎల్ లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఈఓఆర్.ప్రమీల, జిఎం మహదేవయ్య, ప్రిన్సిపాల్ యు.రమణయ్య, అకడమిక్ డైరెక్టర్ బాలు, సిబ్బంది గిరిధర్, మల్లీశ్వరి, సురేష్, అద్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



## మంత్రిగారూ.. యంత్రాలిచ్చేదెప్పుడు ?

### ఖరీఫ్ మొదలైనా లభించని ఆమోద ముద్ర

**కోట,జులై 4 ప్రభాతవార్త** రాయితీపై యంత్ర పరికరాలు కావాలంటూ రైతుల నుంచి అందిన దరఖాస్తులు 2500 పైగానే జూన్ తొలి వారంలోనే వాటిని ఇవా ల్సి ఉండగా ఇప్పటి వరకూ పథకానికి జిల్లాల వారీగా ప్రభుత్వం నిధులు కేటాయించింది. మే నెలలోనే రై తుల నుంచి దరకాస్తులు స్వీకరించారు. ఆన్‌లైన్ ప్రక్రి య పూర్తయ్యాక జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రుల ఆమోదం కోసం జాబితాలు పంపిచారు.వీరు సంబంధిత ఎమ్మె ల్యేలకు పంపి ఎంపిక చేయాలని కోరారు. ఎమ్మెల్యేల అభిప్రాయాలు వచ్చాక తుది జాబితాను వ్యవయశా ఖకు పంపితే జిల్లా జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో లా టరీ తీసి ఎంపికైనవారికి పరికరాలు అందించేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. తుది జాబితా రూపొందిం చడం ఇన్‌చార్జ్ మంత్రికి ఇబ్బందింగా తయారైంది. ఈసారి రైతుల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. లక్ష్యం కంటే ఎక్కువ దరఖాస్తులు రావడంతో లాటరీ తీయాలని అధికారులు నిర్ణయించారు.

**ముందుస్తు ప్రణాళితో వెళ్లినా...** ఖరీఫ్ ప్రారంభంలోనే రైతులకు వ్యవసాయ యంత్ర పరికరాలు ఇచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేసింది. వాటి ధరలు, నాణ్యత ప్రమాణాలు,తయారీ దారులను ముందుగానే ఖారారు చేసింది. కేంద్ర యంత్ర పరికరాలపై 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించింది. పథకం అమల్లో ఆగ్రోస్ సంస్థ భాగస్వామ్యం తోలగించడంతో కమీషన్ రూపేణా 4శాతం భారం సైతం తగ్గింది. ఆన్‌లైన్‌లో రైతు నేరుగా ఎంపిక చేసుకున్న పరికరానికి దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించారు

**వివరణం:** రైతులకు ఖరీఫ్ సీజన్ మొదటిలోనే యంత్ర పరికరాలు ఇవ్వాల్సి ఉండగా జాప్యం జరగుతుండటం పై జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణిని ప్రభాతవార్త వివరణ ఇన్‌చార్జ్ మంత్రి లాగేన్ నుంచి జెసి లాగేన్‌కు ఇంకా జాబితా వేళ్లలేదన్నారు. జిల్లా వ్యాప్తంగా రైతుల నుంచి ఆన్ లైన్‌లో 2520 దరఖాస్తులు వచ్చాయిన పేర్కొన్నారు.ఇన్‌చార్జ్ మంత్రి ఆమోదం రాగానే జెసీ పర్యవేక్షణలో లాటరీ విధానంలో లబ్దిదారులను ఎంపిక చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు.



## ఉద్యోగ సమస్యలు పరిష్కరించాలి అని రూరల్ ఎమ్మెల్యేకు వినతి

**నెల్లూరు, జులై 4, ప్రభాతవార్త – కలెక్టరేట్** నెల్లూరు జిల్లా ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్ల సంయుక్త కార్యచరణ కమిటీ వారి దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరణ నిమిత్తం ఎమ్మెల్యేకు విన్నపించుకున్నారు. నెల్లూరు జిల్లా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ బందారుపల్లి. వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ అల్లంపాటి సురేంద్ర రెడ్డి నాయకత్వంలో సభ్య సంఘాల నాయకులు అందరు నెల్లూరు రూరల్ నియోజకవర్గం శాసన సభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిని కలిసి దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయ, ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేయవలసినదిగా కోరారు. ఈ సందర్భంగా గత 3 సంవత్సరాలుగా పెండింగులో ఉన్న వేతన సవరణ, సరెండర్ లీవుల చెల్లింపు, 4 కరవు భత్యాల విడుదల, ఇన్ సర్వీసు ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష మినహాయింపు, సీపీఎస్ రద్దు, తదితర 10 అంశాలతో కూడిన వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా జేఏసీ కో చైర్మన్లు మురళీ మోహన్ రెడ్డి, జి.వీ. చలపతి శర్మ, పి. కిరణ్ కుమార్ (ట్రెజరీశాఖ), వైస్ చైర్మన్లు యం. సుదర్శన్, కె. రాజేంద్ర ప్రసాద్, రామయ్య ఎన్ దశరథ రామయ్య, లక్కాకుల పెంచలయ్య పంచాయతీ రాజ్, శ్రీనివాసరావు పోలీస్ శాఖ, కుమార్ టెక్నికల్, బి రామకృష్ణ ఏపిటిఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, రిటైర్డ్ పెన్షన్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్ఎం గౌస్, వి. శ్రీనాథ్ అసోసియేట్ ప్రెసిడెంట్, ఏవి కృష్ణ కుమార్, నెల్లూరు సిటీ ట్రెజరర్, ప్రసాద్, కృష్ణారెడ్డి నెల్లూరు తాలూకా సెక్రటరీ జనరల్ హజరతయ్య ట్రెజరర్, నవోదయ మహిళా చైర్పర్సన్, లక్ష్మి మహిళా కన్వీనర్, సురేష్, మధు, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## గ్రామాల్లో ఉండే బీడీసీ గ్రంధాలయాలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్ పర్సన్ మేకపాటి శాంతి కుమారి

**కోవూరు, జులై 4 ప్రభాతవార్త :** విస్తృతంగా బి.డి.సి గ్రంధాలయాలను సందర్శిస్తున్న జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్ పర్సన్ మేకపాటి శాంతి కుమారి విషయం శనివారం కోవూరు మండ లంలోని చిన్న పడుగుపాడు, కోవూరు, కొడవలూరు మండలంలోని యల్లాయపాలెం, కొత్తవంగల్లు, విడవలూరు మండలంలోని అలాగానిపాడు, అన్నా రెడ్డిపాలెం, రామచంద్రపురం, బుచ్చి మండలంలోని ఇసకపాలెం, మనుబోలుపాడు, నాగయ్యగుంట గ్రామాల్లో ఉన్నటువంటి బీడీసీ గ్రంధాలయాలను నెల్లూరు జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్ పర్సన్ మేకపాటి శాంతి కుమారి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్నటువంటి గ్రంథాలయాలు గ్రామంలోని ప్రజల అక్షరాస్యత, విజ్ఞానాన్ని పెంపొందించడానికి ఉపయోగపడతాయని, రాబోయే రోజుల్లో దాతల సహకారంతో బీడీసీ గ్రంధాలయాలను అభివృద్ధి చేస్తామని, నెల్లూరు జిల్లాలో బీడీసీ గ్రంధాలయాల ద్వారా వినూత్న రీతిలో రాబోయే రోజుల్లో కార్యక్రమాలు నిర్వహించబోతున్నామని తెలియజేశారు.



## ప్రతి ఓటు కీలకమే

**సీతారామపురం జులై 4 ప్రభాతవార్త** రానున్న ఎన్నికల దృష్ట్యా ప్రతి ఓటు కీలకమని ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించే బాధ్యత అందరిపై ఉందని ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరు బాధ్యతగా ఎస్ఐఆర్‌లో పేర్లను నమోదు చేయించుకొనిడిజిటలైజేషన్ పూర్తి చేసుకోవాలని మాజీ వైస్ఎంపిపి ,వైసిపి మండల ఉపాధ్యాక్షులు రామిశెట్టి తిరపతయ్య పేర్కున్నా రు.శనివారం సీతారామపురం మండల కేంద్రంలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. ఎస్ఐ ఆర్ ధరఖాస్తుల నమోదు ,డిజిటలైజేషన్ విధానం ప్రక్రియను పరిశీలించారు. ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పిం చేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని బిఎల్ఒ, బిఎల్ఎలకు సూచించారు. బిఎల్ఒ కాజామోహుద్దీన్,డిఎల్ఎ గుర్రం సుబ్బయ్య పాల్గోన్నారు.



## కండలేరులో 31.470 టీయంసీల నీటిమట్టం

**రాపూరు, జూలై 4, ప్రభాతవార్త** మండలంలోని కం డలేరు జళాశయంలో శనివారం ఉదయానికి 31.470 టీయంసీల నీటి మట్టం నమోదు అయినట్లు కండలేరు ఇం జనీరింగ్ అధికారులు తెలిపారు.జళాశయం నుండి లో లెవల్ స్లూయిస్ ద్వారా 30 క్యూసెక్కులు, కండలేరు హె డ్ రెగ్యులేటం ద్వారా 850 క్యూసెక్కులు,హెడ్ రెగ్యు లేటర్ పవర్ హౌస్ ద్వారా 1230 క్యూసెక్కుల చొప్పున మొత్తం 2110 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లోగా వెలుతున్నట్లు ఆయన తెలిపారు.



5CTR 5:5CTR 5.qxd 7/4/2026 10:40 PM Page 1



# అధికారుల నిర్లక్ష్యంపై ఎమ్మెల్యే ఆగ్రహం!

## -జనవాణి అర్జీలపై తక్షణ చర్యలకు ఆదేశం



**తిరుపతి విద్య, జూలై 4 (ప్రభాతవార్త):** ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు ఏమాత్రం జాప్యం చేసినా సహించేది లేదని తిరుపతి శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు హెచ్చరించారు. శనివారం ఉదయం తన కార్యాలయంలో నిర్వహించిన జనవాణి కార్యక్రమానికి బాధితులు పోటెత్తారు. నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ సమస్యలపై వచ్చిన ప్రజల నుండి ఎమ్మెల్యే స్వయంగా 54 అర్జీలను స్వీకరించారు. ప్రభుత్వ శాఖల వారీగా వినతులు వెల్లువెత్తడం స్థానిక యంత్రాంగం పనితీరుకు అద్దం పడుతోంది. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కు 2, సహాయ కమిషనర్‌కు 5, ఎస్ఈకి 17, ప్రణాళిక విభాగానికి 4, ఆరోగ్య అధికారికి 15, హార్టికల్చర్ అధికారికి 1, తహసిల్దార్‌కు 3, కలెక్టర్‌కు 1, డీఎంఅండ్‌హెచ్ఓకు 1, డీఈఓకు 1, ఎస్పీడీసీఎల్‌కు 1, శ్రీకాళహస్తి ఆర్డీఓకు 1, బర్డ్ డైరెక్టర్‌కు 1, సీఎంఆర్ఎఫ్‌కు 1, డీసీఓకు ఒక వినతి చొప్పున అందాయి. ముఖ్యంగా ఇంజనీరింగ్, ఆరోగ్య విభాగాల్లో అర్జీలు భారీగా రావడంపై ఎమ్మెల్యే సీరియస్ అయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ జనవాణికి వచ్చిన అర్జీలను బుట్టదాఖలు చేయకుండా, అధికారులు బాధ్యతగా క్షేత్రస్థాయిలో సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. నిరక్ష్య వైఖరి వీడి, ప్రాధాన్యత క్రమంలో పనులు పూర్తి చేయాలని, ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పించుకుంటే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హస్తకళా నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, మున్సిపల్ కార్పొరేషన్ సహాయ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్‌రెడ్డి, డిప్యూటీ తహసిల్దార్ రామచంద్రయ్య, ఎస్పీడీసీఎల్ ఏఈ ఉమాపతి, మాజీ కార్పొరేటర్ ఎస్కే బాబు, క్రికెట్ విజయ్, తిరుత్తణి వేణుగోపాల్, రాజా రెడ్డి, బత్తిన మధు బాబు, రాజేష్ ఆచ్చారి, ఆముదాల వెంకటేష్, కొత్తవీధి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ పాలకమండలి చైర్మన్ వినోద్ రాయల్, ఆళ్వార్ మురళీ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ప్రజా నాయకుడు వంగవీటి రంగా : ఎమ్మెల్యే ఆరణి



**తిరుపతి విద్య, జూలై 4 (ప్రభాతవార్త):** పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం, ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన గొప్ప ప్రజా నాయకుడు వంగవీటి మోహన రంగా అని తిరుపతి శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు కొనియాడారు. శనివారం నగరంలో మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన రంగా 79వ జయంతి వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. నగరంలోని నాలుగుకాళ్ళ మండపం వద్ద రాధా రంగా మిత్రమండలి జిల్లా అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి, రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అనంతవీధి సర్కిల్‌లో రంగా అభిమానులు ఏర్పాటు చేసిన జయంతి వేడుకల్లోనూ ఆయన పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ, వంగవీటి రంగా జీవితం మనకు ధైర్యాన్ని, ప్రజాసేవ పట్ల అంకితభావాన్ని, న్యాయం కోసం పోరాడే తత్వాన్ని నేర్పుతుందన్నారు. ఆయన ఆశయాలను గుండెల్లో పెట్టుకుని ముందుకు సాగాల్సిన బాధ్యత, వాటిని నెరవేర్చాల్సిన కర్తవ్యం నేటి సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉందని స్పష్టం చేశారు. ఈ జయంతి వేడుకల కార్యక్రమాల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ తోట వాసు, రాధారంగామిత్రమండలిప్రతినిధులు,పెద్దసంఖ్యలో రంగా అభిమానులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## 22న పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**తిరుపతి విద్య, జూలై 4 (ప్రభాతవార్త):** ఎస్వీయూ తెలుగు అధ్యయన శాఖలో చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం (అలుమ్ని మీట్) ఈ నెల 22వ తేదీన జరగనున్నట్లు ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్, తెలుగు విభాగ పూర్వ విద్యార్థి ఆచార్య ఎస్.జి.డి. చంద్రశేఖర్ తెలిపారు.తెలుగు అధ్యయన శాఖలో శాఖాధ్యక్షురాలు ఆచార్య రాజేశ్వరమ్మ అధ్యక్షతన జరిగిన ప్రత్యేక సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.ఈ సన్నాహక సమావేశంలో 20 మందికిపైగా పూర్వ విద్యార్థులు పాల్గొని సమ్మేళన నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భంగా ఆచార్య చంద్రశేఖర్ మాట్లాడుతూ జూలై 22న జరిగే ఈ ఆత్మీయ వేడుకకు వివిధ రాష్ట్రాల్లో స్థిరపడిన ఎస్వీయూ తెలుగు విభాగ పూర్వ విద్యార్థులంతా తరలిరానున్నట్లు పేర్కొన్నారు.సమ్మేళనానికి హాజరయ్యే పూర్వ విద్యార్థులు తమ వివరాలను ముందుగానే శాఖాధ్యక్షులకు గానీ, లేదా ఈ కార్యక్రమ కోఆర్డినేటర్ ఆచార్య చంద్రశేఖర్ కి గానీ తెలియజేసి రిజిస్టర్ చేసుకోవాలని ఆయన సూచించారు. నాటి మధుర స్మృతులను నెమరువేసుకునేందుకు, ఒకరినొకరు కలుసుకునేందుకు వీలుగా నిర్వహిస్తున్న ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

## పరీక్షల ఫలితాలను వెంటనే విడుదల చేయాలి!



**తిరుపతి విద్య, జూలై 4 (ప్రభాతవార్త):** ఎస్వీయూ పరిధిలోని పలు పెండింగ్ పరీక్షల ఫలితాలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ శనివారం వివిధ విద్యార్థి సంఘాల నాయకులు వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ టాటా నరసింగరావును మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ, ఎల్ఎల్బీ మొదటి సెమిస్టర్ పరీక్షలు పూర్తై చాలా కాలం గడిచినా ఫలితాలు ప్రకటించకపోవడంతో న్యాయ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితాల ఆలస్యం వల్ల ఉన్నత విద్య, తదుపరి సెమిస్టర్ ప్రవేశాలు, పోటీ పరీక్షల సన్నాహాలపై ప్రతికూల ప్రభావం పడుతోందన్నారు. అదేవిధంగా ఎల్ఎల్బీ ఒకటి నుంచి ఐదో సెమిస్టర్ వరకు ఫలితాలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. అదేవిధంగా, యూజీ డిగ్రీ కోర్సులకు సంబంధించిన ఓల్డ్ ఇయర్ ప్యాటర్న్ ఫలితాలు రాకపోవడంతో వేలాది మంది విద్యార్థులు ఉద్యోగ, ఉన్నత విద్యా అవకాశాలు కోల్పోయే పరిస్థితి నెలకొందని, వీటిని కూడా వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.విద్యార్థుల సమస్యలపై వీసీ సానుకూలంగా స్పందించారని, సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన ఫలితాల విడుదలకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేషనల్ ఎస్సీ, ఎస్టీ జేఏసీ కన్వీనర్ రాపూరి ప్రసాద్ బాబు,మాదిగ జనసైన్యం వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాకర్ మాదిగ,భారతీయ దళిత విద్యార్థి సేన నాయకుడు యుగంధర్,భారతీయ దళిత సేన అధ్యక్షుడు జెడి ప్రసాద్,మాల విద్యార్థి సంఘం నాయకుడు సుకుమార్ మాల,అఖిల భారత అంబేద్కర్ సేన నాయకుడు ప్రభు,వాల్మీకి విద్యార్థి సంఘం అధ్యక్షురాలు వినూత,నేషనల్ అంబేద్కర్ స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు శివకుమార్,తేజా, కెఎం అర్జున్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## వీసీ సదాశివమూర్తితో అకాడమీ చైర్మన్ విల్సన్ భేటీ



**తిరుపతి విద్య, జూలై 4 (ప్రభాతవార్త):** శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రాణి సదాశివమూర్తిని ఆంధ్రప్రదేశ్ తెలుగు ,సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్.డి. విల్సన్ శనివారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ విల్సన్‌ను వీసీ ఘనంగా ఆహ్వానించి, శాలువా కప్పి సత్కరించారు. అనంతరం వేద విశ్వవిద్యాలయం ఏర్పాటు లక్ష్యాలు, ఆశయాలను చైర్మన్‌కు వివరించారు. వేదాల్లో నిక్షిప్తమై ఉన్న శాస్త్ర విజ్ఞానాన్ని, అపార సారస్వతాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. ప్రాచీన ఖగోళ శాస్త్ర పరిజ్ఞానంతో పాటు ఆధునిక మానవ జీవితానికి ఉపయోగపడే అద్భుత విజ్ఞానం వేదాల్లో ఎలా ఇమిడి ఉందో వర్సిటీ గ్యాలరీలోని చిత్రాలను చూపిస్తూ వీసీ పూసగుచ్చినట్లు వివరించారు. మనిషిలో సానుకూల దృక్పథం ఉంటే ఆరోగ్య సమస్యలు పలాయనం చిత్తగిస్తాయని, నేటి సమాజానికి వేద విజ్ఞానాన్ని అందిస్తేనే భవిష్యత్తు మరింత శోభాయమానంగా మారుతుందని స్పష్టం చేశారు.ఈ భేటీలో భాగంగా వేద విశ్వవిద్యాలయం ముద్రించే ప్రతిష్టాత్మక గ్రంథాలు, పుస్తకాలను తెలుగు , సంస్కృత అకాడమీకి అందించేందుకు వీసీ సదాశివమూర్తి సానుకూలంగా అంగీకరించారు. ఇదే సమయంలో సంస్కృత అకాడమీ అభివృద్ధికి వేదిక్ వర్సిటీ తరపున పూర్తి సహకారం అందించాలని చైర్మన్ విల్సన్ కోరారు. ఈ కార్యక్రమంలో అకాడమీ సిబ్బంది రవిప్రసాద్, ధనంజయ తదితరులు పాల్గొన్నారు.

## బిసి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలుగా జ్యోతి



**రామచంద్రాపురం, జూలై 4 (ప్రభాతవార్త):** కెకెవి పురం గ్రామానికి చెందిన పంచవటి జ్యోతిని ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలుగా ఎంపిక చేశారు. ఈ మేరకు శనివారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.శంకర్ రావు, జిల్లా అధ్యక్షుడు కంభం లోకయ్య నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిసిల సంక్షేమం కోసం శాయశక్తులా పనిచేస్తానన్నారు. వెనుకబడిన తరగతుల ప్రజలకు అన్యాయం జరిగితే సహించబోమన్నారు. తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షురాలుగా ఎంపిక చేసిన రాష్ట్ర, జిల్లా నాయకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

## తిరుపతిలో ఐబీఓ రెండో బ్రాంచి



**తిరుపతి విద్య, జూలై 4 (ప్రభాతవార్త):** ఇంటి నిర్మాణం,మరమ్మతులు మరియు గృహ అలంకరణ వస్తువుల విక్రయాల్లో ప్రముఖ సంస్థ అయిన ఐబీఓ తన రెండో బ్రాంచిని తిరుపతిలో శనివారం ఘనంగా ప్రారంభించింది. కరకంబాడి రోడ్డులోని తిమ్మనాయుడుపాలెం, హౌసింగ్ కాలనీ, గంగారాం ఫంక్షన్ హాల్ పక్కన సమీపంలో ఈ సరికొత్త షోరూమ్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా సంస్థ మార్కెటింగ్ మేనేజర్ బి. పవన్ కుమార్ మాట్లాడుతూ.. ఇల్లు నిర్మించడానికి, రీనోవేట్ చేయడానికి లేదా రిపేర్ చేయడానికి అవసరమైన అన్ని రకాల ఉత్పత్తులు ఇప్పుడు ఒకే చోట,ఐబీఓలో లభిస్తాయన్నారు. ఉత్తమ బ్రాండ్లు, అత్యంత తక్కువ ధరలకే ఇక్కడ లభిస్తాయని,తిరుపతి,పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో షోరూం స్టోర్ మేనేజర్ మహబూబ్, బైరాగిపట్టెడ బ్రాంచ్ స్టోర్ మేనేజర్ లక్ష్మణ్, సిబ్బంది పాల్గొన్నారు.

## యస్వీయూలో ఘనంగా జాతీయ గణాంక దినోత్సవం



**తిరుపతి విద్య, జూలై 4 (ప్రభాతవార్త):** స్థానిక యస్వీయూలో గణాంకశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శనివారం జాతీయ గణాంక దినోత్సవం 2026 వేడుకలను విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భారత ప్రధాన గణాంకవేత్త, కేంద్ర గణాంక, కార్యక్రమ అమలు మంత్రిత్వశాఖ కార్యదర్శి ఆచార్య టి.సి.ఎ. అనంత ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన పారిశ్రామిక వృద్ధి, తయారీ క్లస్టర్లు మరియు జి వీ ఏ (స్థూల విలువ జోడింపు) అంచనా అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాసం చేశారు. దేశ ఆర్థిక వృద్ధిని అంచనా వేయడంలో, పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేయడంలో ఖచ్చితమైన గణాంకాల పాత్ర కీలకమైనదని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమానికి ప్రధాన పోషకులుగా వ్యవహరించిన యస్వీయూ ఉపకులపతి (విసి) ఆచార్య టాటా నరసింగ రావు మాట్లాడుతూ.. ప్రస్తుత ఆధునిక కాలంలో పరిశ్రమలు, సాంకేతిక రంగాలతో పాటు నిత్యజీవితంలోనూ గణాంకశాస్త్రం విడదీయరాని భాగమైందని, పరిశోధనలకు ఇది ఎంతో దోహదపడుతుందని వివరించారు. మరో పోషకులు, వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఎం. భూపతి నాయుడు మాట్లాడుతూ, జాతీయ గణాంక దినోత్సవం ప్రాముఖ్యతను, సమాజ శ్రేయస్సుకు గణాంకాలు ఏ విధంగా ఉపయోగపడతాయో విద్యార్థులకు వివరించారు. గణాంకశాస్త్ర విభాగం అధ్యక్షులు ఆచార్య బి. సరోజమ్మ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో అకడమిక్ కన్సల్టెంట్లు డాక్టర్ కె. మురళి, డాక్టర్ పి. రామకృష్ణ రెడ్డి, డాక్టర్ ఎం. నరేష్, డాక్టర్ పి. విష్ణు ప్రియలతో పాటు విభాగ పరిశోధక విద్యార్థులు, అధ్యాపకులు మరియు భారీ సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి!



**రామచంద్రాపురం, జూలై 4 (ప్రభాతవార్త):** సి.రామాపురం సమీపంలోని చుట్టుగుంట వద్ద రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకున్నది. పోలీసుల వివరాల మేరకు.. తిరుపతి ఆటో నగర్‌కు చెందిన హరి (35) సొంత పనుల నిమిత్తం రామచంద్రాపురం వచ్చి తిరిగి తిరుపతికి వెళుతుండగా చైతన్య కళాశాలలకు చెందిన వాటర్ ట్యాంకర్ ఢీకొనడంతో హరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని 108 అంబులెన్స్‌లో తిరుపతి రుయాకు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. పోలీసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

## విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, బాధ్యత అవసరం:ఎస్పీ



**తిరుపతి విద్య, జూలై 4 (ప్రభాతవార్త):** ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, సమాజం పట్ల బాధ్యతాయుతంగా ప్రవర్తించడం అలవరచుకోవాలని తిరుపతి జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ (ఎస్పీ) ఎల్.సుబ్బరాయుడు పిలుపు నిచ్చారు. శనివారం స్థానిక భారతీయ విద్యాభవన్స్ శ్రీ వేంకటేశ్వర విద్యాల యంలో విద్యార్థి నాయకత్వ బృంద ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.క్రీడల ద్వారా విద్యార్థులకు శారీరక దారుఢ్యంతో పాటు ఏకాగ్రత పెరుగుతుందని, జీవితంలో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించడం నేర్చుకోవాలని ఎస్పీ సూచించారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలు, స్వీయ చరిత్రల పుస్తకాలను చదవాలని ఆయన కోరారు. అనంతరం ముఖ్యఅతిథి చేతుల మీదుగా నూతన విద్యార్థి నాయకత్వ బృందంతో ప్రతిజ్ఞ చేయించి, వారికి బ్యాడ్జిలు, జెండాలను ప్రదానం చేశారు.కార్యక్రమానికి అధ్యక్షత వహించిన భారతీయ విద్యాభవన్ తిరుపతి కేంద్ర గౌరవ సంచాలకులు, కోశాధికారి డాక్టర్ ఎన్. సత్యనారాయణ రాజు ప్రసంగిస్తూ.. విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పాఠశాల స్థాయి నుంచే అలవరచుకోవాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం ఎస్పీ ఎల్.సుబ్బరాయుడును శాలువా, స్మారక చిహ్నంతో ఘనంగా సత్కరించింది. ఈ వేడుకల్లో భారతీయ విద్యాభవన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉప ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గంజాయి నిర్మూలనపై అవగాహన సదస్సు

### – ప్రత్యేక మొబైల్ బస్సు ద్వారా డ్రగ్ టెస్టింగ్ కిట్‌ల పరిశీలన



**పాకాల, జూలై 4 (ప్రభాతవార్త):** పాకాల మండలం దామలచెరువు గ్రామంలో గంజాయి, ఇతర మత్తుపదార్థాల నిర్మూలనపై శనివారం ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తిరుపతి జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక మొబైల్ బస్సు (పోలీస్ అవేర్‌నెస్ వ్యాన్) ద్వారా ఈ ప్రచారాన్ని చేపట్టారు. చంద్రగిరి ఎస్డీపీఓ (డీఎస్పీ) బేతాల ప్రసాద్ పర్యవేక్షణలో ఈ అవగాహన క్యాంప్ విజయవంతంగా జరిగింది. ఈ సందర్భంగా మత్తు పదార్థాలకు బానిసలైన వారిని గుర్తించేందుకు గంజాయి వినియోగాన్ని అరికట్టేందుకు ప్రత్యేక డ్రగ్ టెస్టింగ్ కిట్‌ల ద్వారా పరీక్షలు నిర్వహించే విధానాన్ని అధికారులు పరిశీలించారు. ఈ క్యాంప్‌నకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పాకాల సర్కిల్ ఇన్స్పెక్టర్ టి. చిన్న గోవింద దగ్గరుండి చూసుకున్నారు. పరీక్ష చేద్దాం మత్తును వదిలిద్దాం అనే నినాదంతో, గంజాయి, ఇతర మత్తు పదార్థాల సమాచారాన్ని పోలీసులకు అందించి సమాజ మార్పునకు సహకరించాలని ఈ సందర్భంగా అధికారులు ప్రజలకు పిలుపునిచ్చారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత రహస్యంగా ఉంచబడుతాయని స్పష్టం చేశారు.

## రేపు ఎస్వీ పశువైద్య వర్సిటీలో ఉచిత టీకాలు

**తిరుపతి విద్య, జూలై 4 (ప్రభాతవార్త):** ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 6వ తేదీ (సోమవారం) తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం (ఎస్వీవీయూ)లో పెంపుడు జంతువులకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు వేయనున్నట్లు అధికారులు తెలిపారు. వర్సిటీ ఆవరణలోని పశువైద్య చికిత్స సముదాయ విభాగంలో సోమవారం ఉదయం నుంచి ఈ ఉచిత టీకాల కార్యక్రమం ప్రారంభం కానుంది.మూడు నెలల వయసు దాటిన పెంపుడు కుక్కలు, పిల్లులకు ఈ యాంటీ రేబిస్ టీకాలను ఉచితంగా వేయనున్నట్లు పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి. జగపతిరామయ్య, పశువైద్య చికిత్స సముదాయం విభాగాధిపతి డాక్టర్ ఎస్. భారతి సంయుక్త ప్రకటనలో వెల్లడించారు. తిరుపతి నగరంలోని పెంపుడు జంతువుల యజమానులందరూ ఈ అద్భుతమైన సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

## ఎస్.జి.ఎస్ కళాశాలలో అల్లూరి జయంతి



**తిరుపతి విద్య, జూలై 4 (ప్రభాతవార్త):** స్వాతంత్ర సమరంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ప్రదర్శించిన ధైర్య సాహసాలు, త్యాగం , దేశభక్తి నేటి యువతకు ఆదర్శప్రాయమని తిరుపతి ఎస్.జి.ఎస్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి. సత్యనారాయణ కొనియాడారు. శనివారం కళాశాల చరిత్ర విభాగం ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపల్ డాక్టర్ బి. సత్యనారాయణ మాట్లాడుతూ, అల్లూరి జీవితం నేటి సమాజానికి, ముఖ్యంగా విద్యార్థులకు ధైర్యం, క్రమశిక్షణ, సేవాభావం మరియు దేశభక్తి వంటి అమూల్యమైన విలువలను నేర్పుతుందన్నారు. బ్రిటీష్ పాలకులకు ఎదురొడ్డి నిలిచిన ఇటువంటి మహనీయుల పోరాట చరిత్రను, వారి త్యాగాలను భావితరాలకు పరిచయం చేయాల్సిన బాధ్యత ప్రతి విద్యార్థిపై ఉందని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. మాదన్న, చరిత్ర విభాగాధిపతి కే. రాజేష్, అధ్యాపకులు డాక్టర్ రామనాథం, డాక్టర్ కొండలరావు, డాక్టర్ ఎన్. వినోద్‌లతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

## అమరావతి, మావిగన్ ప్రతిపాదనలపై చర్చ జరగాలి

### – మేధావుల ఫోరం రాయలసీమ కన్వీనర్ ఎం.పురుషోత్తం రెడ్డి

**తిరుపతి హెల్త్, జూలై 4 ప్రభాతవార్త:** అమరావతి రాజధాని నూతన నగర ప్రతిపాదిత ప్రాజెక్ట్ ఆచరణ సాధ్యం కాదని రాష్ట్ర ప్రభుత్వానికి భారంగా మారుతుందని అందుకు ప్రత్యామ్నాయంగా మావిగన్ ప్రతిపాదనను మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిపాదించిన నేపథ్యంలో ప్రభుత్వం హేతుబద్ధమైన చర్చకు సిద్ధం కావాలన్నారు. అమరావతి ప్రాజెక్ట్ సాధ్య సాధ్యాలపై ప్రభుత్వం దృష్టి సారించాలి కోరారు. రాజధాని వేరు నూతన నగరం వేరు అని,గతంలో హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, కలకత్తా,లాంటి నగరాలు రాజధాని పేరుతో నిర్మాణం జరగలేదని, అప్పటికే అందుబాటులో ఉన్న నగరాలలో రాజధానిని ఏర్పాటు చేసుకున్నారన్నారు. ప్రతి రాజధాని మహానగరం కావాల్సిన అవసరం లేదని,అందుకు ఉదాహరణ గాంధీ నగర్,చండీగఢ్ లాంటి అభివృద్ధి చెందిన రాష్ట్రల రాజధానులె ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు అని చెప్పారు. అమరావతి నూతన నగరానికి 54వేల ఎకరాలలో నిర్మాణం అవుతుంది అని,ఇప్పటికే భూములు ఇచ్చిన 34వేల మంది రైతులకు ఒక లక్షకు పైగా ప్లాట్లు అభివృద్ధి చేసి ఇవ్వాలి. 54వేల ఎకరాలలో మౌలిక వసతుల కల్పన జరగాలని, దీనికి అయ్యే ఖర్చు సుమారు ఒక లక్ష కోట్లు అవుతుందన్నారు. రాజధాని వరద నివారణ కోసం బ్లూసిటి కాన్సెప్ట్ ప్రోగ్రాం క్రింద మూడు రిజర్వాయర్లు పలు లిఫ్టులు ఏర్పాటుకు 8వేల కోట్లు ఖర్చు చేస్తున్నారని, రాజధాని కార్యాలయాల నిర్మాణం పేరుతో వేల కోట్లు ఖర్చు చేయబోతున్నారని ఆరోపించారు. రైతులకు అభివృద్ధి చేసిన ప్లాట్లు, రాజధానిలోని సాధారణ పరిపాల,అవసరాల కోసం నిర్మించే కార్యాలయాల కోసం 1.5 లక్షల కోట్లు ఖర్చు అవుతుందని,ఇక నూతన నగరం నిర్మాణం జరిగేది ఎప్పుడు అని ప్రశ్నించారు. ఇప్పటి వరకు వివిధ బ్యాంకులతో అప్పుల కోసం కుదుర్చుకున్న రుణాలు మొత్తం 47 వేల కోట్లు వుందని,ఈ మొత్తం కూడా నిర్దిష్ట కాల వ్యవధిలో విడుదల వుతుందని అన్నారు. ప్రతిపాదిత అమరావతికి సమీపంలో అందుబాటులో ఉన్న నగరాలగా గుంటూరు, విజయవాడ,మన ముందున్నాయి. నోయిడా పరిస్థితి అమరావతికి వస్తుంది.ఇప్పటివరకు కౌలు కోసం 2500 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసింది. మరో 50 వేల ఎకరాలు సేకరిస్తే మొత్తానికి 400 నుంచి 500 కోట్లు ఏడాదికి కౌలు కోసమే ఖర్చు చేయాల్సి ఉంటుందని దుబారా ఖర్చు ఆందోళన కలిగిస్తుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సముదాయాల నిర్మాణానికి ఒక్కో ఎస్ఎఫ్టికి అయ్యే ఖర్చు 5587 రూపాయలు 54.55 లక్షల ఎస్ఎఫ్టిల నిర్మాణానికి అయ్యే ఖర్చు 2534 కోట్ల రూపాయలు. అదే ఏపీ ప్రభుత్వం నిర్మిస్తున్న సచివాలయ ఎస్ ఎఫ్ టి ఖర్చు 20013 రూపాయలు. కేంద్ర ప్రభుత్వ నిర్మాణాలతో పోల్చుకుంటే ఏపీ ప్రభుత్వం నిర్మిస్తున్న కార్యాలయాల ఖర్చు ఒక్కో ఎస్ ఎఫ్ టి పై 14826 రూపాయలు అదనపు భారం అవుతుంది. ఆర్థిక వనరుల కొరత, ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాల కోసం అప్పులు చేయాల్సిన స్థితిలో ఉన్న రాష్ట్రంలో నూతన నగరం నిర్మాణం అవసరం ఉన్నదా? సాధ్యమా? అన్నారు. మావిగన్ ప్రతిపాదనపై సమగ్ర చర్చ జరగాలి. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిపాదించిన మావిగన్ ప్రాంతం ఇప్పటికే అన్ని రకాల మౌలిక వస్తువులు కలిగి ఉన్నదని,గుంటూరు విజయవాడ, మచిలీపట్నం, అభివృద్ధి చెందిన నగరాలు రాజధానికి కావలసిన కార్యాలయాలు మినహా అన్ని రకాల మౌలిక వసతులు ఇప్పటికే ఉన్నాయని, ఫలితంగా మావిగన్ ప్రాంతంలో ప్రభుత్వ భూమిలో పది నుంచి 15 వేల కోట్ల రూపాయలతో కార్యాలయ నిర్మాణం చేపడితే రాజధాని నిర్మాణం పూర్తి అయినట్లే అన్నారు. విజయవాడ, గుంటూరు, రెండు నగరాలు హైదరాబాద్ సికింద్రాబాద్ ఎలాగైతే జంట నగరాలుగా మారిపోయినాయో గుంటూరు, విజయవాడ కూడా జంట నగరాలుగా మారిపోతాయని, రెండు నగరాలకు ఆనుకునే ఉన్న ప్రస్తుత అమరావతి, తెనాలి వైపు కూడా అభివృద్ధి జరుగుతుందని, ఖర్చు తక్కువ, అభివృద్ధికి మార్గం సుగమం అవుతుందని అన్నారు. రాష్ట్ర వనరులను అప్పుల అవకాశాలను మొత్తాన్ని రాజధాని నగర నిర్మాణం చుట్టూనే వెచ్చిస్తే రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాజెక్టులు మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేయడానికి నిధులు ఎక్కడ నుండి తెస్తారన్నారు.మామిడి రైతులకు కిలోకు నాలుగు రూపాయలు సబ్సిడీ ఇవ్వాలన్న నిధులు కొరత అంటుందని, 2000 కోట్లతో రాయలసీమ లిఫ్ట్ పూర్తి చేయడానికి నిధులు లేవు, పదివేల కోట్లతో గుండ్రేవుల ప్రాజెక్ట్ నిర్మాణం చేపడితే రాయలసీమ నీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందని, అందుకు ప్రభుత్వం వద్ద నిధులు లేవు అని చెబుతున్నదని అన్నారు.

## కెన్సస్ హోటల్లో వేగా ఎగ్జిబిషన్ ప్రారంభం



**తిరుపతి విద్య, జూలై 4 (ప్రభాతవార్త):** నగరంలోని మహిళలను ఆకట్టుకునేలా ప్రముఖ వేగా జువెలరీ సంస్థ ఏర్పాటు చేసిన ప్రత్యేక ఎగ్జిబిషన్ శనివారం ఘనంగా ప్రారంభమైంది. స్థానిక ఓ ప్రయివేట్ హోటల్‌లో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను ఇంటర్నేషనల్ బ్యూటిషన్, కర్ణాటక ఛాంపియన్ వాసుకి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎగ్జిబిషన్‌లో ప్రదర్శనకు ఉంచిన ఆభరణాలు ఎంతో ఆకర్షణీయంగా, సరికొత్త డిజైన్లతో ఉన్నాయని కొనియాడారు. తాను వేగా ఆభరణాలకు పెద్ద అభిమా నినని, వారు ఎక్కడ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినా తప్పకుండా సందర్శిస్తానని తెలిపారు. అనంతరం సంస్థ బిజినెస్ హెడ్ శ్రీనివాసులు మాట్లాడుతూ, హిరణ్య కలెక్షన్ పేరుతో ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్ జూలై 4,5 తేదీల్లో (శని, ఆదివారాలు) రెండు రోజుల పాటు అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. ఎగ్జిబిషన్ ప్రత్యేక ఆఫర్ కింద కొనుగోళ్లపై 15 శాతం డిస్కౌంట్ అందిస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సంస్థ మేనేజర్ సింహాచలం, పావని తదితరులు పాల్గొన్నారు.

## నాదమునిరెడ్డి జ్ఞాపకార్థం... వైకుంఠ రథం వితరణ



**చంద్రగిరి, జూలై 4 (ప్రభాతవార్త):** చంద్రగిరిలో నిర్మిస్తున్న కైలాసధామంకు నరశింగాపురంకు చెందిన రెడ్డివారి ప్రీతమ్ రెడ్డి వైకుంఠ రథంను విరాళంగా అందజేయనున్నట్లు ప్రకటించారు. చంద్రగిరిలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న కైలాసధామంను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరశింగాపురం గ్రామం తరపున ప్రస్తుతం రూ.5,16,287లు విరాళం లభించినట్లు తెలిపారు. మరో రూ.3 లక్షల వరకు విరాళలాలు అందే అవకాశం వుందన్నారు. కమిటీ తరపున వీరంగారి రమేష్‌రెడ్డి కైలాసధామంకు వైకుంఠరథంను వితరణ కోరినట్లు తెలిపారు. రూ.10 నుండి 12 లక్షలు వ్యయంతో వైకుంఠరథంను కొనుగోలు చేసి మా తాత దివంగత రెడ్డివారి నాదమునిరెడ్డి, నాయనమ్మ లీలావతమ్మల జ్ఞాపకార్థం అందజేయనున్నట్లు తెలిపారు. ఇదేకాకుండా కార్పొరేట్ సంస్థల నుండి తనవంతుగా విరాళాలను వసూలు చేసి అందజేయనున్నట్లు హామీ ఇచ్చారు. అనంతరం కమిటీ సభ్యులకు విరాళం మొత్తాన్ని నగదు రూపంలో అందజేశారు.

## తిరుపతి గంగమ్మ సేవలో మాజీ ప్రింటింగ్ ప్రెస్ చైర్మన్

**పులిచెర్ల, జూలై 4 (ప్రభాతవార్త):** తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ తల్లి ఆలయంలో అమ్మవారి మొక్కలు చెల్లించుకున్న చిత్తూరు జిల్లా మాజీ ప్రింటింగ్ ప్రెస్ చైర్మన్ గోటూరి మురళీమోహన్ రెడ్డి కుటుంబ సభ్యులు అమ్మవారినీ దర్శించుకుని మొక్కులు చెల్లించుకుని అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు.

5CTR 3:5CTR 3.qxd 7/4/2026 10:41 PM Page 1



# కలెక్టర్‌ను ఘనంగా సన్మానించిన అధికారులు



**తిరుపతి కలెక్టరేట్, జులై 4 ప్రభాతవార్త :**
తిరుపతి జిల్లా కలెక్టర్ గా విజయవంతంగా రెండు సంవత్సరాల సేవలను పూర్తి చేసుకున్న కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్‌కి జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు ఘనంగా అభినందనలు తెలిపారు. 2024, జూలై 4వ తేదీన జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన ఆయన ప్రజాకేంద్రిత పరిపాలన, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల సమర్థ అమలకు విశేష కృషి చేస్తూ తిరుపతి జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పలువురు జిల్లా స్థాయి అధికారులు కలిసి సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

**జిల్లా అభివృద్ధి, సమర్థ నాయకత్వం :**
జిల్లా అభివృద్ధి, ప్రజాసంక్షేమ కార్యక్రమాలలో సమర్థవంతమైన నాయకత్వాన్ని ప్రదర్శించారు. పారదర్శక పాలనతో ప్రజలకు సత్వర సేవలు అందించడంలో పరిపాలన సాగిస్తున్నారు. ప్రభుత్వ పథకాల అమలులో సమన్వయం ఫలితాల సాధనకు ప్రత్యేక ప్రాధాన్యత అందిస్తున్నారు. పారిశ్రామిక ప్రగతి జిల్లాలో పెట్టుబడును ఆకర్షించడం, పరిశ్రమల స్థాపనకు అనుకూల వాతావరణం కల్పించడం,పారిశ్రామికవేత్తలకు వేగవంతమైన అనుమతులు అందించే దిశగా చర్యలు తీసుకుంటూ పారిశ్రామిక అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు.

**వైద్య, విద్య విభాగాలను మౌలిక వసతుల అభివృద్ధి :**
రాయలసీమకు తలమాన్నికగా ఉన్న తిరుపతిలోనీ రుయా ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్యం అందించడానికి మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా నూతన భవనాలు, అదనపు పడకల విస్తరణ వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య శిబిరాల నిర్వహణ వంటి అంశాల్లో కలెక్టర్ గారి ప్రత్యేక దృష్టి కనిపించింది. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా మన తిరుపతి జిల్లాలో ప్రభుత్వ బడుల్లో హాజరు శాతం పెంచడం కోసం 36 మండలాల్లో 36 రోజులు పాటు బడి పిలుస్తుంది ప్రచార రథాన్ని ప్రారంభించడం జరిగింది. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ బడుల్లో అందుతున్న సౌకర్యాలను, విద్యార్థులకు ఉత్తమ బోధన అందించేందుకు క్వాలిఫైడ్ టీచర్లను, డొక్కా సీతమ్మ మధ్యాహ్నం బడి భోజనంతో కూడిన పౌష్టిక ఆహారం అందేలా ప్రత్యేక చొరవ చూపిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో అందుతున్న సౌకర్యాలను క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం పదివేలకు పైగా ప్రభుత్వ బడుల్లో హాజరు శాతం పెంచేలా కృషి చేశారు.

**ప్రజలకు చేరువైన ప్రత్యక్ష పరిపాలన :**
ప్రతి సోమవారం జిల్లా పరిపాలన కార్యాలయంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి నేరుగా అర్జీలను స్వీకరించి వారి సమస్యలను స్వయంగా తెలుసుకొని స్వీకరించి వాటిని సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకొని వెంటనే పరిష్కరించే చర్యలు తీసుకుంటున్నారు. గ్రామాల వారీగా పర్యటిస్తూ ప్రభుత్వ సేవలు ప్రజలకు సమర్థవంతంగా అందేలా అధికార యంత్రాంగాన్ని నిరంతరం పర్యవేక్షి స్తున్నారు.

**నూతన కార్యక్రమాలకు రూపకల్పన :**
ముఖ్యమంత్రి వారి ఆదేశాలు మేరకు ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, జిల్లాకు ప్రత్యేక అవసరాలను పరిగణనలోకి నూతన కార్యక్రమాల రూపొందించి విజయవంతంగా అమలు చేస్తున్నారు.యువత ఉపాధి కల్పన, మహిళల ఆర్థిక సాధికారత నైపుణ్య అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు.

**జిల్లా ప్రజల నుండి అభినందనలు :**
సమగ్ర అభివృద్ధి, పారదర్శక పాలన ప్రజలకు అందుబాటులో ఉండే పాలనతో తిరుపతి జిల్లాను అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళుతున్న జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ కి జిల్లా వ్యాప్తంగా ప్రజలు, ప్రజాప్రతినిధులు అధికారులు ఆయన సేవలను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## ఎమ్మెల్యే ఆదిమూలంకు ఘన సత్కారం



**సత్యవేడు, జూలై 4 ప్రభాతవార్త:**
తిరుపతి జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేపథ్యంలో, సత్యవేడు టీడీపీ ఎమ్మెల్యే ఆదిమూలంపై గతంలో విధించిన సస్పెన్షన్ ఎత్తివేతకు మార్గం సుగమమైందనే ప్రచారం పార్టీలో జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని ఏడు మండలాల టీడీపీ నాయకులు, సీనియర్ నేతలు, కార్యకర్తలు, ఎమ్మెల్యే అభిమానులు ఆయనకు ఘన స్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీని నమ్ముకుని తన వెంట నడిచిన ప్రతి నాయకుడికి,కార్యకర్తకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. సత్యవేడు నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమని, పార్టీ బలోపేతానికి అందరితో కలసి పని చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కేవీబీ పురం సీనియర్‌నాయకుడు రామాంజులనాయుడు, నాగలాపురం నాయకుడు యాచేంద్రనాయుడు, వరదయ్యపాళెం నాయకుడు కరుణాకర్ నాయుడు, సత్యవేడుకు చెందిన లోకనాథంరెడ్డి, నరేంద్ర, నాగరాజు, రవిరెడ్డి, పిచ్చాటూరుకు చెందిన ఇళంగోవన్‌రెడ్డితో పాటు వివిధ మండలాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నార

## విశిష్ట సేవలందిస్తున్న...జిల్లా కలెక్టర్‌కు ఘన సత్కారం

**వరదయ్యపాలెం, జూలై 4 ప్రభాతవార్త:**



తిరుపతి జిల్లా కలెక్టర్‌గా రెండేళ్లపాటు విశిష్ట సేవలందించిన డాక్టర్ వి.ఎస్. వెంకటేశ్వర్‌ను శనివారం జిల్లా కలెక్టరేట్ లోని కలెక్టర్ చాంబర్‌లో బీజేపీ, తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వరదయ్యపాలెం మండల బీజేపీ అధ్యక్షుడు దిలీప్ రాయల్, తెలుగుదేశం పార్టీ మాజీ అధికార ప్రతినిధి, తిరుపతి పార్లమెంటరీ నియోజకవర్గం అడ్వకేట్ డా. ఎస్. నాగరాజు, బీజేపీ యువ మోర్చా నాయకులు అన్వేష్, కలిసి కలెక్టర్‌ను శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, తిరుపతి జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమం, పారదర్శక పాలనలో డాక్టర్ వి.ఎస్. వెంకటేశ్వర్ అందించిన సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. జిల్లా కలెక్టర్‌గా ఆయన ప్రజలకు అందుబాటులో ఉంటూ సమర్థవంతమైన పరిపాలన అందించారని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత బాధ్యతల్లోనూ ఇదే నిబద్ధతతో విశిష్ట సేవలందించి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా, శ్రీ కలియుగ వేంకటేశ్వర స్వామి, శ్రీకాళహస్తీశ్వర స్వామి, శ్రీ జ్ఞానప్రసూనాంబిక అమ్మవారి దివ్య ఆశీస్సులు ఎల్లప్పుడూ ఆయనపై ఉండాలని వారు ప్రార్థించారు.

## స్వయం ఉపాధితో మహిళల అభివృద్ధి సాధ్యం

### డిఆర్ డిఏ పీడీ శోభన్ బాబు



**పెనగలూరు(జూలై 04) ప్రభాతవార్త**
తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం పెనగలూరు మండలం లో స్వయం ఉపాధి వ్యాపార పనులు చేయడం వలన పొదుపు మహిళల అభివృద్ధి సాధ్యమని డిఆర్డిఏ పీడీ శోభన్ బాబు తెలిపారు. శనివారం ఆయన పెనగలూరు మండల పర్యటన లో భాగంగ నారాయణ నెల్లూరు లోని పొదుపు మహిళలు తయారు చేసిన గంపలు, బుట్టలను ఆయన పరిశీలించారు. వారు తయారు చేసిన వస్తువులకు అయ్యే ఖర్చులు, అమ్మకం తరువాత వచ్చే లాబాల గురించి అడిగి తెలుసు కున్నారు. మహిళల ఆర్థిక అభివృద్ధి కి ప్రభుత్వం అన్ని రకాల ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. చిన్న చిన్న వ్యాపారాల కోసం వెలుగు కార్యాలయం ద్వారా రుణాలు ఇస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమం లో ఏపీఎం నిరంజన్ కుమార్, సిసి సుధాకర్, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

## మతి స్థిమితం లేని యువతితో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు

**విజయపురం, జూలై 4 ప్రభాతవార్త:**



మండలంలోని పన్నూరులో మతి స్థిమితం లేని యువతి(22)తో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై శనివారంపోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసు కథనంమేరకు వివరాలు...పన్నూరులో ద్రౌపదీ సమేతధర్మరాజుల తిరుణాళ్ళలో భాగంగా ప్రతి రోజు వీధి నాటకం నిర్వహించేవారు. అందులో భాగంగా కుటుంబ సభ్యులతోయువతి వీధి నాటకం చూడడానికి శుక్రవారం వెళ్లింది. పన్నూరు గ్రామంలో అనారోగ్య కారణంగా ఒకవ్యక్తి రాత్రి 10 గంటల సమయంలో మృతి చెందడంతో వీధి నాటకం ఆపేశారు. అందరూ ఇంటికి చేరుకుంటున్న సమయంలో తమిళనాడు కనకమ్మసత్రంకు చెందిన పాండ్యన్(65) అదే గ్రామంలో ఓ ఇంటిలో అద్దెకు ఉంటూ వీధి నాటకం చూడడానికి వచ్చి తిరుగు పయనంలో మతి స్థిమితం లేనియువతిపై కన్నుపడి ఆమెను జన సంచారం లేని ప్రాంతానికి తీసుకెళ్లి ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. రాత్రి మొత్తం యువతి తల్లిదండ్రులు, గ్రామస్తులు వెతికినా కనిపించలేదు. ఉదయం పన్నూరు సబ్‌స్టేషన్ మైదానం వద్దషెడ్డులో యువతి ఏడుస్తూ ఉందని రోడ్డున వెళ్లే వ్యక్తి సమాచారం తెలపడంతో గ్రామస్తులు వెళ్లి పాండ్యన్‌కు దేహశుద్ధి చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి చేరుకుని పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ దేవరాజులు తెలిపారు.

## రైతులే రాజులు...ప్రజలే పాలకులు : బొజ్జల బృందమ్మ

**రేణిగుంట, జూలై 4 ప్రభాతవార్త :**




ఎన్డీఏ కూటమి పాలనలో రైతులంతా రాజులు, ప్రజలే పాలకులని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ అన్నారు. రేణిగుంట మండలం జి.పాలెం పంచాయతీ నల్లపాలెం గ్రామం నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ సర్వే ప్రాజెక్టు ద్వారా రైతులకు బృందమ్మ రాజముద్రతో ఉన్న పాసు పుస్తకాలను తహసీల్దార్ శ్రవణ కుమార్ సమక్షంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బృందంను తహసీల్దార్ శ్రవణ్ కుమార్ రైతులు టిడిపి నేతల కలసి ఘనంగా సత్కరించారు. అనంతరం బృందమ్మ మాట్లాడుతూ తెలుగు గంగ ప్రాజెక్టు ద్వారా రైతులకు నీరు అందించిన ఘనత పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు సొంతం చేసుకున్నారని, కృష్ణా గోదావరి జలాలను అనుసంధానం చేసిన ఖ్యాతి చంద్రబాబుకు దక్కుతుందన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించింది మొదలు రైతుల సంక్షేమానికి, పేద ప్రజల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నదన్నారు. కొంతమంది భూభకాసురల వల్ల నష్టపోయిన రైతులకు రీసర్వే ద్వారా గుర్తించి వారికి కొత్త పాస్ పుస్తకాలు ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి మార్కెటింగ్ చైర్మన్ చెంచయ్య నాయుడు, తిరుపతి పార్లమెంటరీ టిడిపి ఉపాధ్యక్షుడు చెర్లోపల్లి సుబ్రహ్మణ్య రెడ్డి, రేణిగుంట మండల టిడిపి అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ భాస్కర్ రెడ్డి, జి పాలెం టిడిపి సీనియర్ నాయకులు శివారెడ్డి ,రైతులు పాల్గొన్నారు.

ఆర్జిటి 1. బృందమ్మను సత్కరిస్తున్న దృశ్యం.

## ఘనంగా మన్యం వీరుడు అల్లూరి జయంతి

**రేణిగుంట, జూలై 4 ప్రభాతవార్త:**




బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించి వారి గుండెల్లో వణుకు పుట్టించిన తెలుగు వీరుడు అల్లూరి సీతారామ రాజు అని జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరమణ అన్నారు. రేణిగుంట బాలుర బాలికల పాంశాలల్లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శనివారం అల్లూరి సీతారామరాజు జయంతి ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటాలకు పూలమాలలో వేసి అశ్రునయనాలతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఓవి రమణ మాట్లాడుతూ తెలుగు ప్రజలు గర్వించదగ్గ గొప్ప యోధుడని అల్లూరి సీతారామరాజును కొనియాడారు. స్వాతంత్ర కోసం వివాహం కూడా చేసుకోకుండా స్వాతంత్ర పోరాటంలో సమిధగా ప్రాణత్యాగం చేసిన గొప్ప త్యాగమూర్తి అన్నారు. మన్యంలోని గిరిజనులను స్వాతంత్ర యోధులుగా మార్చిన గొప్ప స్వాతంత్ర సమరయోధుడన్నారు. ఆయన స్వాతంత్రం కోసం చేసిన త్యాగాలను గుర్తించి ఆంధ్రప్రదేశ్లో ఒక జిల్లాకు అల్లూరి సీతారామరాజు జిల్లాగా నామకరణం చేయడం ఆయన గొప్పతనానికి నిదర్శనం అన్నారు. కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయురాలు శంకరి, సోషల్ టీచర్ ఇమామ్ ఖాన్, ఉపాధ్యాయులు భారతి, ఉమామహేశ్వరి, విజ్ఞాన వేదిక మండల కార్యదర్శి కుప్ప స్వామి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేయండి

**రేణిగుంట, జూలై 4 ప్రభాతవార్త:**



బడుగు బలహీన వర్గాలకు జాప్యం చేయకుండా న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చక్రపాణి విజ్ఞప్తి చేశారు. నూతనంగా రేణిగుంట తహసిల్దారుగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన శ్రవణ్ కుమార్‌ను శనివారం ఎంఆర్పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చక్రపాణి మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. రెవిన్యూ శాఖలో బడుగు బలహీన వర్గాల ప్రజల సమస్యల పరిష్కారం ఆలస్యం అవుతుందని వారి సమస్యలు సత్వరం పరిష్కరించే దిశగా కృషి చేయాలని తహసీల్దారును చక్రపాణి కోరారు. ఈ సందర్భంగా తహసిల్దార్ శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ చట్టబద్ధంగా పనిచేస్తానని ప్రజలకు జవాబుదారితనంతో కూడిన పారదర్శక సేవలు అందిస్తానని తెలిపారు. పేద ప్రజల కోసం చట్టంలో ఎలాంటి అవకాశాలు ఉన్నా వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

## నిర్విత గడువు లోపల సర్ ప్రక్రియ పూర్తి కావాలి

**రేణిగుంట, జూలై 4 ప్రభాతవార్త:**



భారత ఎన్నికల కమిషన్ నిర్దేశించిన సమయంలో గా సర్ (స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్) పూర్తిచేయాలని రేణిగుంట ఎంపీడీవో రవిచంద్ర ఆదేశించారు. రేణిగుంట మండలంలోని వివిధ సచివాలయాలను శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఉద్యోగులు సర్ ప్రక్రియపై పనిచేస్తున్న తీరును పరిశీలించారు. బాధ్యతాయుతంగా సర్ ప్రక్రియ పూర్తిచేయాలని దిగు స్థాయి ఉద్యోగులను ఆదేశించారు. సర్ ప్రక్రియ లో అవకతవకలు దొరికితే ఉపేక్షి ంపమన్నారు. జాగ్రత్తగా చుట్టుపక్కల విచారించి ఓటర్ల జాబితా పూర్తి చేయాలన్నారు. చనిపోయిన వారి పేర్లు ఓటర్ల జాబితా నుండి తొలగించాలని కోరారు. ఓటర్ల జాబితాలో చనిపోయిన వారి పేర్లు పొరపాటున కూడా ఉండకూడదన్నారు. ఒకవేళ ఉంటే ఆ ప్రాంతానికి చెందిన బిఎల్ఓలపై ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. 2002 ఓటర్ల జాబితాకు ప్రస్తుతం నమోదు చేస్తున్న ఓటర్ల జాబితా అనుసంధానం కావాలన్నారు.తనిఖీ చేసిన వారిలో డిప్యూటీ ఎంపీడీవో కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

# తిరుపతి డివిజన్

## కరమల్ల వల్లీకి గౌరవ డాక్టరేట్ ప్రదానం

### -సామాజిక సేవకు అంతర్జాతీయ గౌరవం




**తిరుపతిరూరల్,జూలై 4 ప్రభాతవార్త:**
సామాజిక సేవా రంగంలో విశిష్ట కృషి చేస్తున్న కరమల్ల వల్లీకి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. యునైటెడ్ అమెరికన్ యూనివర్శిటీ ఆధ్వర్యంలో పుదుచ్చేరిలో శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయనకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. సమాజ సంక్షేమం కోసం నిరంతరం సేవలు అందించడం, ప్రజల్లో సామాజిక చైతన్యం పెంపొందించడం వంటి రంగాల్లో ఆయన చేసిన కృషిని గుర్తిస్తూ విశ్వవిద్యాలయ ప్రతినిధులు ఈ అత్యున్నత గౌరవాన్ని అందజేశారు. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ ఆంధ్రప్రదేశ్ న్యాయమూర్తులు, తమిళనాడు అధికారులు, తెలంగాణ మాజీ ప్రతినిధులు, పలువురు ప్రముఖులు హాజరై కరమల్ల వల్లీని అభినందించారు. విద్యావేత్తలు, సామాజిక సేవకులు మాట్లాడుతూ సమాజాభివృద్ధి కోసం నిస్వార్థంగా సేవలందిస్తున్న వారిని ఇలాంటి గౌరవాలతో ప్రోత్సహించడం అభినందనీయమని పేర్కొన్నారు. కరమల్ల వల్లీ సేవలు సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తాయని కొనియాడారు. గౌరవ డాక్టరేట్ స్వీకరించిన వల్లీ మాట్లాడుతూ ఇది నా వ్యక్తిగత గౌరవమే కాకుండా నా వెంట నడిచిన ప్రతి సహచరుడికి దక్కిన గుర్తింపు అని, భవిష్యత్‌లో మరింత బాధ్యతతో సమాజానికి సేవలు అందిస్తామని తెలిపారు. పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

## కువైట్‌లో ఏపి ఎన్ఆర్టీఎస్...

### రీజనల్ కో-ఆర్డినేటర్‌గా మాలేపాటి సురేష్‌బాబు



**తిరుపతిరూరల్,జూలై 4 ప్రభాతవార్త:**
కువైట్‌లో ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ (ఎపిఎన్ఆర్‌టిఎస్) రీజనల్ కో-ఆర్డినేటర్‌గా మాలేపాటి సురేష్ బాబు నాయుడు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఆనందం వ్యక్తం చేస్తూ... తనపై నమ్మకం ఉంచిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. కువైట్‌లోని ప్రవాస ఆంధ్రుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం కోసం వారధిగా నిలుస్తాయని, రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా నిబద్ధతతో పని చేస్తామని ఆయన స్పష్టం చేశారు. తనకు ఈ పదవి రావటానికి సహకరించిన సుబ్బరాయుడు, శ్రీనివాస చౌదిరి, కుదరవల్లి సుధాకర్‌రావు, మల్లారపు భాస్కర్‌నాయుడు, లక్ష్మీపతినాయుడు, ఉదయ్‌ప్రకాష్, పాలడుగు సురేష్‌బాబు, ఈశ్వర్ నాయుడు, జిలానీ భాషా, పాలేకరి సంఘం అధ్యక్షుడు శ్రీహరినాయుడులకు కృతజ్ఞతలు తెలిపారు..

## షేక్ మొహమ్మద్ రఫీకి గౌరవ డాక్టరేట్

**తిరుపతిరూరల్,జూలై 4 ప్రభాతవార్త:**



తిరుపతికి చెందిన వరల్డ్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ నేషనల్ ప్రెసిడెంట్ షేక్ మొహమ్మద్ రఫీకి గౌరవ డాక్టరేట్ లభించింది. పుదుచ్చేరిలో నిర్వహించిన కార్యక్రమంలో యునైటెడ్ అమెరికన్ యూనివర్శిటీ ఫర్ లీడర్ షిప్ అండ్ ఎక్సలెన్స్ డాక్టర్ ఆఫ్ బిజినెస్ (హానరరీ) డిగ్రీని ప్రదానం చేశారు. వ్యాపార రంగంలో చేసిన సేవలు, నాయకత్వం, సమాజాభివృద్ధికి చేసిన కృషిని గుర్తించి ఈ గౌరవం అందించినట్లు యూనివర్శిటీ ప్రతినిధులు తెలిపినట్టు తెలిపారు. ఈ సందర్భంగా రఫీ మాట్లాడుతూ ఈ గుర్తింపు తనపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్‌లో యువతకు ప్రోత్సాహం, సామాజిక సేవ, ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు మరింత కృషి చేస్తామని తెలిపారు.

## మహిళలకు ఉచిత నైపుణ్య శిక్షణ

**పుత్తూరు రూరల్, జూలై 4 ప్రభాతవార్త:**



పుత్తూరు పట్టణంలోని సాయిబాబా ఆలయం సమీపంలో ఉన్న ప్రిన్సెస్ బ్యూటీషియన్ శిక్షణ సంస్థలో రాస్ జన్ శిక్షణ్‌సంస్థాన్ ఆధ్వర్యంలో ఉచిత బ్యూటీషియన్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ మోహన్ మాట్లాడుతూ మహిళల స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు 20 మంది మహిళలకు 80 రోజుల పాటు ఉచిత బ్యూటీషియన్ శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ హరిబాబు, వాసవి మాట్లాడుతూ శిక్షణ పొందే వారికి అవసరమైన బ్యూటీషియన్ మెటీరియల్స్‌ని పూర్తిగా ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. కోర్సును విజయవంతంగా పూర్తి చేసిన ప్రతి శిక్షణార్థికి గుర్తింపు పొందిన సర్టిఫికెట్‌ని ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. అలాగే శిక్షణ అనంతరం స్వయం ఉపాధి ప్రారంభించేందుకు రాస్ సంఘాల ద్వారా ఆర్థిక రుణాల సౌకర్యం కూడా కల్పించనున్నట్లు వెల్లడించారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నైపుణ్యాలను పెంపొందించుకుని ఆర్థికంగా స్వావలంబన సాధించాలని నిర్వాహకులు కోరారు.

## సమగ్ర సవరణలో ఇంటింటా సర్వే

**విజయపురం, జూలై 4 ప్రభాతవార్త:**



కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని జంబాడ, పాత ఆర్కాడు గ్రామాల్లో మండల ఎస్ఐఆర్ సూపర్‌వైజర్ మార్కండేయ ఇంటింటా సర్వేలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంబంధిత బీఎల్‌వోలకు తగిన సలహాలు, సూచనలను అందించారు. ప్రతి ఒక్క అర్హుడు తమ ఓటు హక్కుని వినియోగించుకునేలా ఓటర్ల జాబితాలో పేర్లు నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఓటర్ల జాబితా సవరణలో ఏదేని సందేహాలు తలెత్తినప్పుడు మా దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో పాల్గొనే ప్రతి ఒక్కరు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు. వీరితో పాటు బీఎల్‌వోలు, బీఎల్ఏలు, గ్రామాల్లోని పలువురు ఓటర్లు పాల్గొన్నారు.

## సత్యవేడులో తమ్ముల మధ్య కుములాట

### -వివాదాస్పద భూమిలో ఓ పరిశ్రమ ఏర్పాటుకు శంకర్‌రెడ్డి భూమిపూజ!



**సత్యవేడు, జూలై 4 ప్రభాతవార్త:**
తిరుపతి జిల్లా సత్యవేడు మండలం లోని పాలగుంట గ్రామంలోని ఓ వివాదాస్పదమైన భూమిలో టీడీపీ ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్ శంకర్‌రెడ్డి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరై స్ప్రెరీ రీసైక్లింగ్, పాలిమర్ తయారీ పరిశ్రమ ఏర్పాటుకు భూమిపూజ చేశారు. ఇక్కడ ఉన్నటు వంటి ఐదు ఎకరాలకు పైబడి భూమి తమదంటే తమదే నని, స్థానిక మాజీ సర్పంచ్ ఈశ్వరయ్య,టీడీపీ మాజీ ఎంపీపీ ఓ వైపు, మరోవైపు పరిశ్రమ ఏర్పాటు దారులు చెప్పుకుంటున్నారు. అయితే ఈ విషయమై ఓ దశలో మాజీ వైసీపీ పార్టీ అనుచరులు, పాలగుంట తెలుగుదేశం పార్టీ మాజీ సర్పంచ్‌ల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. కాగా శంకర్‌రెడ్డి,తన అనుచరులతో కలసి వివాదాస్పద భూమిలో పరిశ్రమ ఏర్పాటుకు భూమి పూజ చేయడం సర్వత్రా చర్చనీయాంశం అయింది. బాధిత మాజీ సర్పంచ్ స్థానిక ఎమ్మెల్యే వద్దకు చేరుకుని తన గోడును విన్నవించుకుని సాయం చేయాల్సిందిగా అభ్యర్థిస్తున్నట్లు సమాచారం. మరీ బాధితులకు ఎమ్మెల్యే ఏ విధంగా న్యాయం చేస్తారో వేచి చూడాల్సి ఉంది.

